RNI NO: TEL/TEL/2009/28544
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
సంపుటి : 18
సంచిక : 83
Vol : 18
Issue : 83



# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక
విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం
Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044
కరీంనగర్, శనివారం 23 మే 2026
Karimnagar, Saturday 23 May 2026
పేజీలు : 08
వెల రూ : 4-00
Pages : 08
Price : 4-00


WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859



7వ పేజీలో..

- సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు
- న్యాయస్థానంలో పలువురు పిటిషన్లు దాఖలు
- రిజర్వేషన్ల కోటా నుంచి బయటకు రావాలన్న కోర్టు

## ఐఏఎస్‌ల పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?




7వ పేజీలో..

కేంద్రం కీలక మార్గదర్శకాలు జారీ!

విమానాశ్రయాల్లో హెల్త్ స్క్రీనింగ్ తప్పనిసరి

నిఘాను మరింత కఠినతరం చేసిన ప్రభుత్వం

## భారత్‌కు ఎబోలా ముప్పు?



2వ పేజీలో..

తెలంగాణలో భారీగా ఉద్యోగాల భర్తీ..

ఏకంగా 15,982 పోస్టులు నిపేందుకు కసరత్తు

త్వరలోనే నోటిఫికేషన్ విడుదలయ్యే ఛాన్స్

## నిరుద్యోగ మహిళలకు గుడ్‌న్యూస్

## పులి పంజా...

- నలుగురు మహిళలు మృతి
- బీడీ ఆకుల సేకరణకు వెళ్ళినవారిపై పులి దాడి..

**పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ :** మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. బీడీ ఆకులు సేకరించేందుకు అడవిలోకి వెళ్లిన నలుగురు మహిళలపై పులి దాడి చేసి అక్కడికక్కడే చంపేసింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం గంజేవాహి గ్రామం సమీప అటవీ ప్రాంతంలో జరిగింది. అటవీశాఖ అధికారుల సమాచారం ప్రకారం, గ్రామస్తులైన ఈ మహిళలు ఉదయం 8 గంటల ప్రాంతంలో బీడీ ఆకులు ఏరుకోవడానికి అడవికి వెళ్లారు. ఆకులు ఏరుకుంటున్న సమయంలో ఒక పులి హఠాత్తుగా వారిపై దాడి చేసింది. దీంతో నలుగురు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మిగతా

(మిగతా 2లో...)



## అనేక ప్రశ్నలు... అధికారుల అనుమానాస్పద సమాధానాలు

- సీతారామ ప్రాజెక్టు అవార్డు లిస్ట్‌లో గోల్‌మాల్
- మండిపడుతున్న రైతన్నలు
- 107 సర్వేనెంబర్... 154గా ఎలా మారింది..?
- వరుస కథనాలు వస్తున్నా ఉన్నతాధికారుల మౌనమెందుకు?
- చర్యలు తీసుకునే నాథులే లేరా...?

2వ పేజీలో..

## కేసీఆర్ కోసం రంగంలోకి పీకే?

బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేయనున్నారా?

త్వరలోనే అధికారిక ఒప్పందం జరిగే ఛాన్స్

గతంలో కీలక నేతల గెలుపులో పీకే పాత్ర



**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తెలంగాణలో జమిలి లేకుంటే 2028 లో.. ఏపీలో 2029 లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి అసెంబ్లీ ఎన్నికలు రెండు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకం. అధికారం నిలబెట్టుకొనేందుకు అధికార పార్టీలు.. తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే వ్యూహాలను అమలు చేస్తున్నాయి. ఇదే సమయంలో బీఆర్ఎస్ కు మద్దతుగా పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిషోర్ రంగంలోకి దిగుతున్నట్లు తెలుస్తోంది. (మిగతా 2లో...)

## త్రివేణి తీరాన భక్తి ప్రవాహం

**పీపుల్స్‌డైరీ-భూపాలపల్లి :** కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలు ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో సరస్వతి ఘాట్‌కు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. పవిత్ర త్రివేణి సంగమంలో స్నానమాచరిస్తే పాపాలు పోయి పుణ్యఫలాలు లభిస్తాయనే విశ్వాసంతో తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున కాళేశ్వరానికి చేరుకున్నారు. ఘాట్‌లన్నీ భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయాయి. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమ ప్రదేశంలో కుటుంబ సమేతంగా పుష్కర స్నానాలు చేసిన భక్తులు (మిగతా 7లో)



- సరస్వతి అంత్య పుష్కరాలకు పోటెత్తుతున్న భక్తులు
- కాళేశ్వరం క్షేత్రంలో ఆధ్యాత్మిక వెల్లువ
- భక్తి పారవశ్యంతో పుణ్యస్నానాలు
- సైకత లింగాలతో ప్రత్యేక పూజలు..
- మార్మోగిన శివనామస్మరణలు
- ఆధ్యాత్మిక మహోత్సవంలో భక్తుల పరవశం
- కిక్కిరిసిన ఘాట్లు.. కట్టుదిట్టమైన ఏర్పాట్లు





## 'గల్లీ'జు దందా!

### రోగాలకు పుట్టి 'నీళ్లు'

- వరంగల్‌లో మినరల్ వాటర్ వ్యాపారం
- పాకురు పట్టి దుర్వాసన వస్తున్న నీటిని సరఫరా
- క్యాన్‌లలో సైతం పాకురు... ఇసుకతో క్లీన్
- నాణ్యతా ప్రమాణాలు లేకుండా ప్లాంట్‌ల రన్నింగ్
- రోగాలభారిన పడుతున్న ప్రజలు
- ఐఎస్ఐ, బీఐఎస్ అనుమతులు లేకుండా సరఫరా
- మున్సిపల్ ట్రేడ్ లైసెన్సులు సైతం సరిగా ఉండవు
- పొల్యూషన్ కంట్రోల్ అనుమతులు ఉండవు

2వ పేజీలో..



# అనేక ప్రశ్నలు.. అధికారుల అనుమానాస్పద సమాధానాలు

- సీతారామ ప్రాజెక్టు అవార్డు లిస్ట్‌లో గోల్‌మాల్
- మండిపడుతున్న రైతన్నలు
- 107 సర్వేనెంబర్... 154గా ఎలా మారింది..?
- వరుస కథనాలు వస్తున్నా ఉన్నతాధికారుల మౌనమెందుకు?
- చర్యలు తీసుకునే నాథులే లేరా...?

**సింగరేణి (కారేపల్లి), మే 22 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని సీతారామ ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూసేకరణ-అవార్డు లిస్ట్‌లలో అనేక అనుమానాస్పద మార్పులు, గోల్‌మాల్ జరిగాయని రైతులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో "పీపుల్స్ డైరీ" దినపత్రిక బృందం తాసిల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లును వివరణ కోరగా, ఆయన ఇచ్చిన సమాధానాలు మరింత అనుమానాలకు తావిస్తోంది. అయితే తాసిల్దార్ వివరణ మరింత సందేహాలకు దారి దారితీస్తుందని "పీపుల్స్ డైరీ" బృందానికి రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. తాసిల్దార్ మాటల్లోనే పెద్ద గోల్‌మాల్ స్పష్టమవుతోంది. "107 సర్వేనెంబర్ భూములు పోలేదు, కేవలం 154 సర్వేనెంబర్ భూములే పోయాయి" అని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సింగరేణి మండల తహసిల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు ఇచ్చిన సలహా ఏమిటంటే.... "మీ 107 సర్వేనెంబర్ భూములు మీరే వెతుకులాడుకోండి... అవి ఎక్కడున్నాయో మాకు సంబంధం లేదు... చూపించడం మా బాధ్యత కాదు" భూమి సాగు ఎవరు చేస్తున్నారో వారిదే భూమి అని, అవార్డులు వారి పేరు మీదనే నమోదు కాబడతాయని... ల్యాండ్ ఆక్వేషన్ కలెక్టర్ భూమి సాగులో ఉన్నవారికి అవార్డులు ప్రకటించారని చెప్పే ఆయన వ్యాఖ్యలు రైతుల హక్కులను నిర్లక్ష్యం చేసినట్లుగా కనిపిస్తున్నాయి.



### ఒకే హద్దు రైతుల పేర్లు రెండు ప్యాకేజీల్లో ఎలా?

భూములు కోల్పోయిన వారికి 107లో ఇవ్వాల్సిన 8 ప్యాకేజీ సాయం అర్హులు మళ్లీ 13వ ప్యాకేజీలో 154 లో కూడా ప్రకటించడం పై గ్రామస్థుల్లో తీవ్ర అనుమానాలకు దారి తీస్తోంది. 107 సర్వే నెంబర్లు పోయాయని చెబుతూనే, అదే భూములకు సంబంధించిన రైతుల పేర్లు 8 ప్యాకేజీలో, 13వ ప్యాకేజీలో కూడా అదే రైతులకు విస్తీర్ణంతో చేర్చి వ్రాసినట్టు ఎలా నమోదు అయ్యాయి? ఈ ప్రశ్నకు అధికారులు స్పష్టమైన సమాధానాన్ని ఇవ్వలేకపోతున్నారు. 1954-2018 వరకు 107 గా ఉన్న రికార్డ్‌ను - అకస్మాత్తుగా 154గా ఎలా మార్చారు? గతంలో ఆర్ఐ-2 గా పనిచేసి ఇచ్చిన అధికారిక రికార్డుల ప్రకారం- 1954 నుండి 2018 వరకు సంబంధిత భూములు 107 సర్వేనెంబర్ గానే రికార్డుల పరంగా ఉన్నాయని, కానీ 2018 తర్వాత తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిలో అకస్మాత్తుగా 154 సర్వే నెంబర్లుగా మార్చినట్లు అధికారులు చూపుతున్న విధానం తీవ్ర అనుమానాస్పదంగా ఉందన్నారు. ఆ ఆర్ఐ ఇచ్చిన రికార్డ్ ప్రకారం 107 సర్వే నంబర్లే వాస్తవం అని పత్రాలతో నిర్ధారించారని రైతులు ఆర్ఐ ఇచ్చిన పూర్తి ఆధారాలతో తహసిల్దార్‌కు వివరణ ఇచ్చినా.. తహసిల్దార్ మాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మీరు ఏమైనా ఉంటే కోర్టుల ద్వారా చూసుకోండి అని సమాధానం ఇచ్చారని అంటున్నారు. రైతులు, రెండవ పరిధి ఆర్ఐ స్థానాన్ని కూడా శాసించిన ఆర్ఐ 1 రాసి ఇచ్చిన రిపోర్టు ప్రకారం తహసిల్దార్ ఆఫీస్‌లో రికార్డులను పరిశీలించకుండా, రికార్డులతో సంబంధం లేకుండా, రికార్డులు అన్ని అనుమానాస్పదంగానే ఉన్నాయని రైతులు అన్నారు. గతంలో కూడా ఆర్ఐ1 పై అవినీతి ఆరోపణలు, పత్రిక కథనాలు వచ్చాయని రైతులు అనుమానం వ్యక్తం చేశారు.

స్థానికులు కోరుతున్నది ఒక్కటే...

అవార్డు లిస్ట్‌లపై స్వతంత్ర విచారణ జరపాలి... రికార్డులు పరిశీలించాలి... 2018లో జరిగిన సర్వే నెంబర్ మార్పులపై పారదర్శక నివేదిక చేయించాలి... రెండు ప్యాకేజీల్లో పేర్లు చూపుతున్న డూప్లికేట్ చెల్లింపులపై దర్యాప్తు జరపాలి. ఇదిలా ఉండగా, సీతారామ ప్రాజెక్ట్ అవార్డు లిస్ట్‌లో వెలుగుచూస్తున్న ఈ అవకతవకలు స్థానిక పరిపాలనపై ప్రజల్లో తీవ్రమైన అనుమానాలను రేకెత్తిస్తున్నాయి.

# నిరుద్యోగ మహిళలకు గుడ్‌న్యూస్

- తెలంగాణలో భారీగా ఉద్యోగాల భర్తీ..
- ఏకంగా 15,982 పోస్టులు నిపేందుకు కసరత్తు
- త్వరలోనే నోటిఫికేషన్ విడుదలయ్యే ఛాన్స్

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో నిరుద్యోగులైన మహిళలకు ముఖ్యగమనిక.. త్వరలోనే భారీగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభంకానుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో భారీగా ఉద్యోగలను భర్తీ చేయనున్నారు.. మొత్తం 15,982 పోస్టులను భర్తీ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ పోస్టుల భర్తీకి ఈ ఏడాదిలోనే నోటిఫికేషన్ జారీ చేయనునున్నారు. అంగన్‌వాడీలలో కొంతమందికి ప్రమోషన్లు, మరికొందరు రిటైర్ అవుతున్నారు. 2025-26 ఏడాది నాటికి పదోన్నతులు, పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీలను పరిగణనలోకి తీసుకోనున్నట్టు తెలుస్తోంది.. కొత్తగా ఏర్పడిన 708 ఉద్యోగాలను కూడా కలిపి 15,982 పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిలో హెల్పర్స్ పోస్టులు 12,882 ఉన్నాయి.. టీచర్ పోస్టులు 3,100 ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు ఉంటే.. సుమారు 71,562 మంది పనిచేస్తున్నారు. వీరిలో టీచర్లు, వర్కర్లు ఉన్నారు.. అంగన్‌వాడీలలో గత మూడేళు ్లగా పదవీ విరమణ, సిబ్బందికి సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు వచ్చాయి. కొంతమందికి వేరే శాఖలలో శాశ్వత ఉద్యోగాలు రావడంతో ఖాళీలు వచ్చాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో 22.33శాతం పోస్టులు ఖాళీ అయ్యాయి.

త్వరలో శిశు సంక్షేమ శాఖ విద్యార్హతలు, నియామక విధానంపై క్లారిటీ ఇవ్వనుంది. ముందుగా అంగన్‌వాడీలలో కొత్త నియామక విధానానికి ఆమోదం తెలిపి.. ఆ తర్వాత జిల్లాల వారీగా నోటిఫికేషన్లు విడుద చేయనున్నారు. అంగన్‌వాడీల్లో ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటుగా 9వేల కేంద్రాలకు కరెంట్ కనెక్షన్లు, 7,700 వేల కేంద్రాలకు మరుగుదొడ్డి, మరో 5 వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తారు. 3,300 కేంద్రాలకు తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. వెయ్యి కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. మొత్తం మీద తెలంగాణ సర్కార్ ఈ ఏడాది అంగన్‌వాడీల్లో ఉద్యోగాలను భర్తీ చేయనుంది. తెలంగాణలో నిరుద్యోగ మహిళలకు ఇది చక్కనైన అవకాశం.. త్వరలోనే ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేయనుంది. రాష్ట్రంలో ఈసారి ఏకంగా 15,982 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



# గల్లీజు దందా

- వరంగల్‌లో మినరల్ వాటర్ వ్యాపారం
- పాకురు పట్టి దుర్వాసన వస్తున్న నీటిని సరఫరా
- క్యాన్‌లలో సైతం పాకురు... ఇసుకతో క్లీన్
- నాణ్యతా ప్రమాణాలు లేకుండా ప్లాంట్ రన్నింగ్
- రోగాలభారిన పడుతున్న ప్రజలు
- ఐఎస్ఐ, బీఐఎస్ అనుమతులు లేకుండా సరఫరా
- మున్సిపల్ ట్రేడ్ లైసెన్సులు సైతం సరిగా ఉండవు
- పొల్యూషన్ కంట్రోల్ అనుమతులు ఉండవు
- ఎటువంటి ముడి సరుకులు లేకుండా కల్తీ నీరు సరఫరా
- గల్లీకో వాటర్ ప్లాంట్‌తో దండుకుంటున్న యజమానులు
- చేతులు తడిపితే చాలన్నట్టు సంబంధిత అధికారుల తీరు

**పీపుల్స్‌డైరీ ప్రతినిధి, వరంగల్**

వరంగల్ నగరంలో మినరల్ వాటర్ ప్లాంట్ల దందా విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్రజల ప్రాణాలకు ఏమైతే మాకేంటి... మా ఇష్టం వచ్చినట్టు నీటిని అమ్ముకుని డబ్బులు దండుకుంటాం అన్నట్టుగా వారి ప్రవర్తన ఉంది. నగరంలో కుళాయిల ద్వారా వచ్చే నీటిని డైరెక్ట్‌గా తాగలేక మెజార్టీ ప్రజలు మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తుంటారు. ఇక ఎండాకాలం వేళ మినరల్ వాటర్‌కు మస్తు డిమాండ్ ఉంటుందన్న విషయం తెలిసిందే. ప్రజల నీటి అవసరాన్ని అవకాశంగా మార్చుకుంటున్న మినరల్ వాటర్ ప్లాంట్ల యజమానులు అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దంచి కొడుతున్న ఎండలకు తాళలేక చిన్నా చితక ప్రజలు రోడ్డుపై వ్యాపారాలు చేసుకుంటూ ఎండ వేడికి తాలలేక మినరల్ వాటర్ అని అలవాటు పడుతున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వందల సంఖ్యలో వెలసిన మినరల్ వాటర్ ప్లాంట్ లు విచ్చలవిడిగా కల్తీ నీటి వ్యాపారం కొనసాగిస్తున్నాయి. ప్రతి నిత్యం లక్షల క్యాన్ల నీరు ప్రజలు ఉపయోగిస్తున్నారు. ఇలా చూస్తే కోట్ల రూపాయల వ్యాపారం కేవలం నీటి పైనే సంపాదిస్తున్నారు.

### అనుమతులు లేని వాటర్ ప్లాంట్ల యజమానులు

వరంగల్ నగరంలో గల్లీ కో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని సామాన్య ప్రజలకు అలవాటుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఎటువంటి నాణ్యతా ప్రమాణాలు లేకుండా కనీసం పాటించకుండా ఇష్టారాజ్యంగా క్యాన్లు కడగకుండానే తిరిగి అందులోనే నీటిని నింపేస్తూ అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతూ రోగాల బారిన పడేలా చేస్తున్నారు. వరంగల్ హంటర్ రోడ్డు, ఖమ్మం బైపాస్, రామన్నపేట, కరీమాబాద్, ఉర్సు, రంగశాయి పేట, బట్టుపల్లి రోడ్డు, శివనగర్, కాశీబుగ్గ, దేశాయి పేట ప్రాంతాల్లో వాడ వాడలా విచ్చలవిడి కల్తీ మినరల్ వాటర్ ప్లాంట్లు నడుస్తున్నట్టు సమాచారం. నామ మాత్రపు అనుమతులు... ఏకంగా ఎటువంటి అనుమతులు సైతం లేకుండా ఐ ఎస్ ఐ బ్రాండ్ అంటూ నకిలీ ప్లాంట్లూ నడుపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇలాంటి వాటి పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాల్సిందే

### వాటర్ ప్లాంట్లను పర్యవేక్షించే అధికారులే కరువు

అసలే దంచి కొడుతున్న ఎండలు వీటికి తోడు కల్తీ నీళ్లు... ఇలా కొన్నేండ్లుగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని నడుపుతున్న యాజమాన్యాలకు అసలు ప్లాంట్ ఏర్పాటుకు కనీస అవగాహన, ఎటువంటి నాణ్యత ప్రమాణాలు పాటించాలి, నీటిని ఎలా శుద్ధి పర్చాలి..? లాంటి కనీస అవగాహన లేకుండా నడుపుతున్నారు. కేవలం అక్రమార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న స్పష్టమవుతోంది. ఈ విషయంలో అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడంపై జనం మండిపడుతున్నారు. అధికారులు కనీస బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందంటున్నారు. ఇలాంటి నీటిని తాగితే మలేరియా, డయేరియా, టైఫాయిడ్, వాంతులు విరేచనాలతో కూడుకున్న జ్వరం వస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి అనుమతులు లేకుండా నామమాత్రపు అనుమతులతో నడుపుతున్న నకిలీ మినరల్ వాటర్ ప్లాంట్ లను పర్యవేక్షించి పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు



### ప్రధాన రహదారులపైనా తగ్గేదేలే....

ప్రధాన రహదారుల్లో ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్లు సేద తీరడానికి వంటకాలకు తాగు నీటి కొరకు బారులు తీరి బారీ వాహనాలు నిలుపుతారు. ట్రాన్స్పోర్ట్ వ్యవస్త ఉన్న ప్రధాన రహదారి, బట్టుపల్లి రోడ్డు, ఉర్సు బైపాస్ నుండి మొదలెడితే అటు కడిపికొండ వరకు దాదాపు పది వాటర్ ప్లాంట్లు ఉంటాయి. వీటికి అందుబాటులో చిన్నా చితక హోటల్‌లు, కూలి పని ఇంటి నిర్మాణాలకు వచ్చి భోజజన సమయంలో నీటిని ఈ ప్లాంట్ల వద్ద నుండే తీసుకుని వెళుతుంటారు. ఇలా హోటల్, భారీ వాహన ప్రయాణించే వారికి కూలి పనికి వచ్చిన వారికి ఇలాంటి కల్తీ మినరల్ వాటర్ ప్లాంట్ వ్యాపారులకు లక్షల్లో గడుస్తున్నాయి.

# 2 వేల కిడ్నీ మార్పిడీలు...

- దేశంలోనే నిమ్స్ ఆస్పత్రి అరుదైన రికార్డు..
- ఉచితంగా 1900 ఆపరేషన్లు

**పీపుల్స్‌డైరీ--హైదరాబాద్ :** హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రి అరుదైన మైలురాయిని అందుకుంది. నిమ్స్‌లో ఇప్పటివరకు 2 వేల కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు పూర్తి చేశారు. దీంతో దక్షిణ భారతదేశంలోనే తొలి ఆస్పత్రి కాగా.. మొత్తం దేశంలో మూడో ఆస్పత్రిగా అరుదైన రికార్డును దక్కించుకుంది. ఈ సందర్భంగా నిమ్స్ ఆస్పత్రి వైద్య బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఇందులో 95 శాతం ఆపరేషన్లను ఉచితంగా నిర్వహించినట్లు వెల్లడించారు.



హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రిలోని డాక్టర్ల బృందంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసలు గుప్పించారు. కిడ్నీ మార్పిడి ఆపరేషన్ల విషయంలో నిమ్స్ ఆస్పత్రి సాధించిన విజయాన్ని సీఎం అభినందించారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో నిమ్స్ ఆస్పత్రి అరుదైన మైలురాయిని అందుకోవడం విశేషం. నిమ్స్ ఆస్పత్రిలోని యూరాలజీ విభాగం.. ఇప్పటివరకు 2 వేల కిడ్నీ మార్పిడి ఆపరేషన్లను పూర్తి చేసుకుంది. ఈ క్రమంలోనే దక్షిణ భారతదేశంలోనే నిమ్స్ ఆస్పత్రి అత్యధిక కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్లతో అగ్రస్థానంలో నిలిచింది.

ఇక దేశం మొత్తంగా చూస్తే.. మూడో స్థానంలో ఉంది. ఇక కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ ఆస్పత్రి తొలి స్థానంలో ఉండగా.. పంజాబ్ లూథియానా క్రిస్టియన్ కాలేజీ రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత నిమ్స్ మూడో స్థానాన్ని అందుకుంది. ఈ సందర్భంగా కిడ్నీ బాధితులకు విజయవంతంగా ఆపరేషన్లు చేసిన నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ 2 వేల మందిలో 1900 మంది అంటే 95 శాతం మందికి ఉచితంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 1900 మందికి ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవడం విశేషమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇక 2023 జనవరి నుంచి ఇప్పటివరకు గత 3 ఏళ్ల 4 నెలల కాలంలోనే 500 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేసి నిమ్స్ ఆస్పత్రి రికార్డు నెలకొల్పిందని వెల్లడించారు.

# పులి పంజా...

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు భయపడి కేకలు వేస్తూ పరుగెత్తి తప్పించుకున్నారు. మృతుల వివరాలు చూస్తే కవుదుబాయి దాదాజీ మొహర్లే, అనుబాయి దాదాజీ మొహర్లే, సునీతా కౌశిక్ మొహర్లే, సంగీతా సంతోష్ మృతి చెందారు. వీరంతా గంజేవాహి గ్రామానికి చెందినవారు.

### దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఈ ప్రాంతంలో బీడీ ఆకుల సేకరణ గ్రామీణులకు ప్రధాన ఆదాయ వనరు. కానీ అడవుల్లోకి వెళ్లడం ఇక్కడ స్థానికులకు ప్రమాదకరంగా మారుతోంది. సమాచారం అందగానే అటవీశాఖ సిబ్బంది స్థలానికి చేరుకుని మృతదేహాలను శవపరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పంచనామా నిర్వహించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఒకే పులి దాడి చేసిందా లేదా ఒకటికి మించి పులులు ఉన్నాయా అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. గ్రామీణులలో భయం ఈ ఘటనతో గంజేవాహి మరియు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అడవికి వెళ్లాలంటే గ్రామస్తులు భయపడుతున్నారు. పులిని పట్టుకోవాలని, అడవుల్లో సురక్షిత చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంచరిస్తున్న పులలను పట్టుకోవాలని సమీప గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# కేసీఆర్ కోసం రంగంలోకి పీకే?

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రశాంత్ కిషోర్. గతంలో ఐ ప్యాక్ నుంచి రాజకీయ వ్యూహకర్తగా గుర్తింపు ఉంది. 2014 లో ప్రధాని మోదీ విజయంలో.. 2019 లో ఏపీలో జగన్ గెలుపులోనూ కీలకంగా పని చేసారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఆయనతోనూ సత్సంబంధాలు కొనాసాగించారు. ఆయన సేవలు అందిస్తారనే అంచనాల వేళ సొంత పార్టీతో బీహార్ రాజకీయాల్లో బిజీ అయ్యారు. గతంలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో స్టాలిన్ - మమతకు రాజకీయంగా సహకరించారు. వారి గెలుపుకు తోడ్పాటు అందించి న ప్రశాంత్ కిషోర్ సొంత రాష్ట్రంలో సొంత పార్టీ గెలుపులో విఫలమయ్యారు. 2024 లో ఏపీలో టీడీపీకి సహకారం అందించారు. కీలకమైన వ్యూహాలతో కూటమి గెలుపులో కీలక పాత్ర పోషించిన ప్రశాంత్ కిషోర్.. ఆ తరువాత బీహార్ కు పరిమితం అయ్యారు. కాగా.. ఇప్పుడు తిరిగి తెలంగాణలో బీఆర్ఎస్ కోసం పని చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.





తెలంగాణలో కొద్ది రోజుల క్రితం కవిత కొత్త పార్టీ ఏర్పాటు వేళ ప్రశాంత్ కిషోర్ సూచనలు, సలహా లు ఇచ్చినట్లు ప్రచారం సాగింది. కాగా.. ఇప్పుడు బీఆర్ఎస్ తమ పార్టీకి ప్రశాంత్ కిషోర్ సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కేసీఆర్ సన్నిహిత నేతలు చర్చలు చేసినట్లు పార్టీలో ప్రచారం సాగుతోంది. అన్నీ అనుకూలిస్తే త్వరలోనే బీఆర్ఎస్ కోసం ప్రశాంత్ కిషోర్ బీఆర్ఎస్ కు మద్దతుగా పని చేసేందుకు ముందుకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

# గ్రామ సమస్యలపై ప్రశ్నిస్తే దాడి చేసి కొడతారా...జర్నలిస్ట్ సంఘాల ఆగ్రహం!

## విలేకరి పై చేయి చేసుకున్న నాయకుడు..

**రేగొండ మే 22 పీపుల్స్ డైరీ..**రేగొండ : సమస్యలపై ప్రశ్నిస్తే జర్నలిస్ట్ ల పై దాడి చేస్తారా అని జర్నలిస్ట్ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.జర్నలిస్ట్ పై దాడి చేసిన నాయకున్ని అరెస్ట్ చేసి చట్ట రీత్యా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.రేగొండ మండలం రూపిరెడ్డి పల్లి గ్రామంలో శుక్రవారం ఓ నాయకుడు జర్నలిస్ట్ పై దాడి చేసి కొట్టిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రూపిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన పీపుల్స్ డైరీ న్యూస్ పేపర్ లో జర్నలిస్ట్ గా చేస్తున్నా జర్నలిస్ట్ గ్రామ సమస్యలపై ప్రశ్నిస్తూ వార్తలు రాసాడు అందుకు గాను కొంతమంది పెద్ద మనుషులు


రూపిరెడ్డి పల్లి పొదుపు సహకార సంఘంలో రాజకీయాలు

గ్రామ పంచాయతీ వద్దా గ్రామ సభ ఏర్పాటు చేసి మాట్లాడుతుండగా గ్రామానికి చెందిన అగ్రకుల నాయకుడు జర్నలిస్ట్ పై దాడి చేసి తీవ్రంగా కొట్టాడు.. తీవ్రంగా గయా పడిన జర్నలిస్ట్ సదరు వేక్తి పై రేగొండ పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసాడు..

## జర్నలిస్ట్ సంఘాల ఆగ్రహం!

సమాజంలో నిజాలను నిర్భయంగా వెలికి తీసే జర్నలిస్ట్ పై దాడులు చేయడం హేయమైన చర్య,రూపిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన జర్నలిస్ట్ పై జరిగిన దాడిని జర్నలిస్ట్ సంఘాలు కండిస్తున్నాయి. గ్రామానికి చెందిన సమస్యను ప్రశ్నిస్తే దాడులకి దిగుతారా కొడతారా అంటు మండిపడ్డారు. జర్నలిస్ట్ పై దాడి చేసిన వేక్తి ని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఎండలకు బయటకి వెళ్లకండి...అవసరమైతే తప్ప బయటికి రావద్దు

- ఎండ తీవ్రత నుండి జాగ్రత్త ప్రజలారా!
- ప్రస్తుతం 45 నుంచి 45.5 డిగ్రీల మధ్య ఎండ తీవ్రత..
- రికార్డు స్థాయి ఎండలు..
- నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు..
- అంబేద్కర్ యువజన సంఘ నాయకులు రాయల శ్రీనివాస్..

**సింగరేణి (కారేపల్లి) మే 22 (పీపుల్స్ డైరీ) :** సింగరేణి మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రజలకు అంబేద్కర్ యువజన సంఘ నాయకులు రాయల శ్రీనివాస్ శుక్రవారం పలు సూచనలు చేశారు.ఈ నాలుగు రోజులు ఎండ తీవ్రత అధికంగా ఉన్న కారణంగా వడగాలులు వస్తున్నాయని ప్రస్తుతం 45 నుంచి 45.5 డిగ్రీల మధ్య ఎండ తీవ్రత నిప్పుల కొలిమిలా మారాయని, ఎండలు విపరీతంగా కొడుతున్నాయి.ప్రజలంతా అవసరం ఉంటే తప్పా బయటకు రాకండి.ఒకవేళ తప్పని సరి పరిస్థితి అయితే చల్లని నీరు,మనిషిని కవర్ చేసుకొని తలకు టోపీ,ఒక టవల్ లాంటిది కట్టుకొని బయటకు వెళ్లండి.అవసరం ఉంటే తప్ప బయటకు వెళ్లకండి అని సూచించారు.అదేవిధంగా వారం రోజులుగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.పనుల కోసం బయటకు వస్తున్న ప్రజలు తీవ్ర ఎండలకు వడదెబ్బకు గురవుతున్నారు. వాతావరణ పరిస్థితులను అంచనా వేసి రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు,మజ్జిగ కేంద్రాల ఏర్పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ వంటి కనీస రక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారని జనాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రజలు ఎండ తీవ్రత



నుంచి కోలుకోవాలంటే కనీస వసతులు ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువజన సంఘ నాయకులు రాయల శ్రీనివాస్ ప్రకటన ద్వారా అధికారులకు తెలిపారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు కృషి చేస్తా...మంత్రి సీతక్క




**ఏటూరు నాగారం మే 22 (పీపుల్స్ డైరీ) :** ములుగు జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ మేరకు శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన టి యు డబ్ల్యు జే (ఐజేయు) యూనియన్ కార్యవర్గం మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి, మెమొంటో అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలో జర్నలిస్టులు ఐకమత్యంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. జర్నలిస్టులో సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. త్వరలోనే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. జర్నలిస్టుల ప్రధాన సమస్య అయిన ఇళ్ల స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మంచి శుభవార్త వెలువడనుందని తెలిపారు. అనంతరం జర్నలిస్టులకు శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు, అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్పీ లను మర్యాద పూర్వకంగా కలిసి మెమంటో అందించి, శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో ఐజేయు జిల్లా అధ్యక్షుడు ఎండి షఫీ అహ్మద్, కార్యదర్శి చిదురాల వాసు, ఉపాధ్యక్షులు బిక్కనూరి సుమన్, చింతల దేవేందర్, ఆలుగొండ రమేష్, ఎనగందుల శంకర్, సునర్కాని శ్యామ్, మల్లేష, హబీబ్ ఖాన్ కొత్తగట్టు నరసింహచారి, జంపాల శ్యామ్, నాయకపు రాజు సుంకరి సంపత్ రావు, గాదె సుమన్ వివిధ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో ఏడు ఎకరాల వరి గడ్డి, 200 బస్తాల వడ్లు దగ్ధం!

- రూ. 2 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడి ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి

**భీమదేవరపల్లి మే22 :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో గురువారం ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగల నుండి (షార్ట్ సర్క్యూట్) సంభవించడంతో ఏడు ఎకరాలకు సంబంధించిన వరి గడ్డితో పాటు, సుమారు 200 బస్తాల మేల్ సీడ్ వడ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన కొండబత్తిని నారాయణ అనే కౌలు రైతు, మరొకరికి చెందిన ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో ఇటీవల మేల్, ఫిమేల్ సీడ్ వరి పంటను కోశారు. ఫిమేల్ సీడ్ వడ్లను ఇప్పటికే విక్రయించగా,మేల్ సీడ్ వడ్లను అదే పొలంలో ఒక పక్కన కుప్పలుగా పోసి ఉంచారు.అయితే,గురువారం పొలం పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నుండి ఒక్కసారిగా నిప్పురవ్వలు (మెరుగులు) చిమ్మి,



పక్కనే ఉన్న ఎండు వరిగడ్డిపై పడ్డాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో మంటలు క్షణాల్లో వ్యాపించాయి.ఈ ప్రమాదంలో ఏడు ఎకరాల ఎండు వరిగడ్డితో పాటు, అక్కడ నిల్వ ఉంచిన 200 బస్తాల మేల్ సీడ్ వరి కుప్పలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి.విషయం తెలుసుకున్న వంగర ఎస్సై దివ్య, గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ తక్షణమే ఘటన స్థలానికి చేరుకున్నారు.ఫైర్ ఇంజన్ సిబ్బందికి సమాచారం అందించారు.ఫైర్ ఇంజన్ వచ్చేలోపు ఎస్సై, సర్పంచ్ తమ సిబ్బందితో కలిసి స్వయంగా మంటలను ఆర్పేందుకు సహాయక చర్యలు చేపట్టారు. అయినప్పటికీ,ఉష్ణోగ్రతల తీవ్రత వల్ల మంటలు అదుపులోకి రాకపోవడంతో భారీ నష్టం వాటిల్లింది.బాధితుడు కొండబత్తిని నారాయణ మాట్లాడుతూ "కౌలుకు భూమి తీసుకుని ఎంతో కష్టపడి పంట పండించాను.ట్రాన్స్ఫార్మర్ నిప్పురవ్వల వల్ల నా కష్టం అంతా బూడిదైందన్నారు. సుమారు రెండు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందని,అప్పులు చేసి పెట్టుబడి పెట్టాను,ఇప్పుడు పూర్తిగా రోడ్డున పడ్డానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నన్ను ఆదుకోవాలని ." బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు.ఈ సందర్భంగా ఎస్సై దివ్య, సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ.. కౌలు రైతు నారాయణకు జరిగిన నష్టం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘోర ప్రమాద సంఘటనను ఉన్నతాధికారుల, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధిత రైతుకు ప్రభుత్వం నుండి తగిన నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

# భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్


## మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్, కమిషనర్ జి మల్లికార్జున స్వామి ..



**జమ్మికుంట. మే 22పీపుల్స్ డైరీ :** తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు మున్సిపల్ కార్యాలయంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ (మే 22,1888 – ఫిబ్రవరి 18, 1939) సంఘ సంస్కర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు. 1906–1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడు. జగన్మిత్రమండలి, మన్యసంఘం, సంఘసంస్కార నాటకమండలి,అహింసా సమాజంలను స్థాపించి హైదరాబాదు ప్రాంతంలో సంఘసంస్కరణలకై కృషిచేశాడు అలాంటి మహనీయుని జయంతిని అధికారికంగా జరుపుకోవడం సంతోషకరమని తెలుపుతూ ఇలా జయంతిని జరుపుకోవడమే కాకుండా యువత వారి ఆశయాల్లో ముందుకుసాగాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి కౌన్సిలర్స్ కొలుగురి సురేష్, కూతడి తిరుపతి, శీలం శ్రీనివాస్, చందా రాజు, మాచర్ల రాజు, మంద రాధా , టి చందన శంకర్ మేనేజర్ జి రాజిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వాణి, శ్రీనివాస్, ఆర్ ఐ భాస్కర్, మరియు వార్డ్ ఆఫీసర్స్ ,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# వడ్ల కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలి

## ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేసిన హుస్నాబాద్ బీజేపీ నాయకులు



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) మే 22 :**బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు హుస్నాబాద్ లో స్థానిక ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా బీజేపీ హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్ మాట్లాడుతూ వడ్ల కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని తరుగు, తేమ లేకుండా కొనుగోలు చేయాలని రైతులకు కావాల్సిన సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు . కొన్ని గ్రామాలలో లారీలు అందుబాటులో లేకపోవడం వలన రైతులు తమసొంత ట్రాక్టర్ల పై వడ్లను తీసుకెళ్తున్న రైతులకు ఇబ్బంది అవుతుంది కావున ఎక్కువ మొత్తంలో లారీలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. రైతులకు ఏ ఇబ్బంది కలిగినా బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కుంట మల్లయ్య, బైరి అరుణ్, నెల్లి శ్రీనివాస్, మెరుగు రవి, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ పై దాడిని ఖండిస్తున్నాం

## పి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర నాయకులు వినయ్



**రేగొండ మే 22 పీపుల్స్ డైరీ..** రేగొండ:నిత్యం ప్రజల మధ్య ఉంటు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై కొంతమంది రాజకీయ నాయకులు చేస్తున్న దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని. పి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర నాయకులు వినయ్ మండిపడ్డారు.రేగొండ మండలం రూపిరెడ్డి పల్లి గ్రామ ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు జర్నలిస్టుపై రాజకీయ నాయకుడు భౌతికదాడులకి పాల్పడడం సిగ్గుమాలిన చర్యని గ్రామ సమస్యలపై ప్రశ్నిస్తే తప్పేంటని, సమస్యలను పరిష్కరించాల్సింది పోయి ప్రశ్నించిన జర్నలిస్టుపై దాడి చేయడం హేయమైన చర్య అని, ప్రశ్నించే జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోతుందని గతంలో ప్రభుత్వాలు చట్టం చేసిన అమలుకు నోచుకోవడం లేదని, జర్నలిస్టులపై దాడులు చేస్తే కఠిన చర్యలు అమలు చేస్తామన్న పోలీసు నిబంధనలను పాటించాలని, జర్నలిస్ట్ పై దాడి చేసిన వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినయ్ డిమాండ్ చేశారు.

# జర్నలిస్ట్ పై దాడి చేసిన వేక్తిని అరెస్ట్ చేయాలి

## డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.తిరుపతి



**రేగొండ మే 22 పీపుల్స్ డైరీ..** రేగొండ: ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై కొంతమంది రాజకీయ నాయకులు చేస్తున్న దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని భారత భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ( డివైఎఫ్ఐ )రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.తిరుపతి తెలిపారు.రేగొండ మండలం రూపిరెడ్డి పల్లి గ్రామ ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు జర్నలిస్టుపై రాజకీయ నాయకుడు భౌతికదాలకి పాల్పడడం సిగ్గుమాలిన చర్య, గ్రామ సమస్యలపై ప్రశ్నిస్తే తప్పేంటని, సమస్యలను పరిష్కరించాల్సింది పోయి ప్రశ్నించిన జర్నలిస్టుపై దాడి చేయడం హేయమైన చర్య అని, ప్రశ్నించే జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోతుందని గతంలో ప్రభుత్వాలు చట్టం చేసిన అమలుకు నోచుకోవడం లేదని, జర్నలిస్టులపై దాడులు చేస్తే కఠిన చర్యలు అమలు చేస్తామన్న పోలీసు నిబంధనలను పాటించాలని, జర్నలిస్ట్ పై దాడి చేసిన వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతి డిమాండ్ చేశారు.

# ధాన్యం కొనుగోలు చేయాలి

## ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా వినతి పత్రం అందజేసిన పార్టీ నాయకులు



**ఏటూరు నాగారం మే 22(పీపుల్స్ డైరీ) :** రైతులు అరుకాలం కష్టపడి పండించిన వరి ధాన్యం, మొక్కలను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలోని నాయకులు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై, కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు సాని కొమ్ము రమేష్ రెడ్డి ఆధ్వర్యంలోని నాయకులు శుక్రవారం ఉదయం 9 గంటలకు రోడ్డుపైకి చేరుకొని ధర్నా కార్యక్రమం నిర్వహిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి రైతులు పండించిన పంటలు కొనుగోలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నవే తప్ప కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కైన రైస్ మిల్లర్లు అందినంత దోచుకుంటూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే కొనుగోలు చేపట్టని పక్షంలో రానున్న రోజులలో ఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోళ్ల వెంకన్న, ముంజాల బిక్షపతి గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జీసీసీ బంకుల్లో నో స్టాక్ బోర్డు



**ఏటూరు నాగారం మే 22 (పీపుల్స్ డైరీ) :** కన్నాయిగూడెం మండలంలోని ముప్పనపల్లి గ్రామ పరిధిలోని బోర్ గూడెంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జిసిసి పెట్రోల్ బంక్ లో పెట్రోల్ లేకపోవడంతో కొరత తీవ్రరూపం దాల్చింది. కన్నాయిగూడెం మండలంలోని ముప్పనపల్లి గ్రామ పరిధిలోని బోర్ గూడెంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జీసీసీ పెట్రోల్ బంక్ లో పెట్రోల్ లేకపోవడంతో కొరత తీవ్రరూపం దాల్చింది. గత కొద్ది రోజులుగా పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డు దర్శనమిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోల్ కొరతను ఆసరాగా చేసుకొని కొందరు బంకుల సమీపంలోని పలు కిరాణా దుకాణాల్లో బాటిళ్లలో పెట్రోల్ నిల్వ చేసి బహిరంగంగానే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ అక్రమ విక్రయాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సరఫరా పునరుద్ధరించి బ్లాక్ మార్కెట్ అధిక ధరలకు అమ్ముతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు



**హుజురాబాద్ టౌన్ మే 22 ( పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగినాయి. భాగ్యరెడ్డి వర్మ ఫోటోకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ వేడుకలు మున్సిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని ఆధ్వర్యంలో జరిగినవి. ఈ కార్యక్రమంలో రొంటాల మనోజ్ రావు, మున్సిపల్ కమిషనర్ కిషన్, మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, రమేష్, వైస్ చైర్మన్ గూడూరి అంజలి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పీపుల్స్ డైరీ
కరీంనగర్
శనివారం, 23 మే 2026
సంపుటి : 18, సంచిక : 83


# బేటీ బచావో -- బేటీ పడావో సందేశంతో మేడ్చల్ యువకుడి దేశవ్యాప్త బైక్ యాత్ర



**మేడ్చల్ మే 22 (పీపుల్స్ డైరీ) :** బేటీ బచావో -- బేటీ పడావో నినాదంతో మేడ్చల్‌కు చెందిన యువకుడు డి. విష్ణువర్ధన్ దేశవ్యాప్త బైక్ యాత్రకు శ్రీకారం చుట్టారు. నాగప్ప మోటార్స్ సౌజన్యంతో అందించిన సుజుకి యాక్సిస్ 125 వాహనంపై ఈ యాత్రను ప్రారంభించారు. శుక్రవారం మేడ్చల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మేడ్చల్ సీఐ సత్యనారాయణ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశం కోసం, బాలికల విద్యాభివృద్ధి కోసం ఇలాంటి అవగాహన యాత్రలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలో బాలికల విద్య, భద్రత, సాధికారతపై చైతన్యం తీసుకురావడంలో యువత ముందుండాలని సూచించారు. యాత్ర స్పాన్సర్ నాగప్ప మాట్లాడుతూ మేడ్చల్ నుంచి సియాచిన్ వరకు, అక్కడి నుంచి కశ్మీర్ మీదుగా కన్యాకుమారి వరకు ఈ బైక్ యాత్ర కొనసాగనున్నట్లు తెలిపారు. మొత్తం 18 రోజుల పాటు సుమారు 7 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్‌కు చెందిన పలువురు యువకులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు నర్సింగ్గారావు గౌడ్, వెంకటేష్, రమణారెడ్డి తదితరులు పాల్గొని యువకుడిని అభినందించారు.

# పంట వ్యర్థాలను,వరి కొయ్యలను తగలబెట్టవద్దు- ఏఈఓ కమలహాసన్



**భీమదేవరపల్లి మే 22 (పీపుల్స్ డైరీ ) :** హార్వెస్టర్ మిషన్లతో పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే వరి కొయ్యలు,మొక్కజొన్న చొప్పను రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ తగులబెట్టవద్దని ముల్కనూర్ వ్యవసాయ విస్తరణాధికారి కమలహాసన్ విజ్ఞప్తి చేశారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూమికి జరిగే నష్టాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో 'డప్పు చాటింపు ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏఈఓ కమలహాసన్ మాట్లాడుతూ.. వరి కొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల భూమి తీవ్రంగా దెబ్బతింటుందని, పర్యావరణానికి భారీ నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. పంట వ్యర్థాలను కాల్చడం మంటల వేడికి నేలలోని మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాములు నశించి సేంద్రియ కర్బనం తగ్గిపోతుందన్నారు. నేలలోని నత్రజని,భాస్వరం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు నశిస్తాయి. భూమి గట్టిపడటంతో నీటిని నిల్వ ఉంచే తేమ తగ్గుతుందన్నారు. పొగ వల్ల వాతావరణం కలుషితమై గ్రామీణ ప్రజలు,ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు శ్వాసకోస వ్యాధుల బారిన పడతారని తెలిపారు. వరికొయ్యలను కాల్చకుండా కల్టివేటర్, రోటావేటర్లతో నేలలోనే కలియదున్నితే భూమి సారవంతమై నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. కొయ్యలు త్వరగా కుళ్లి మంచి ఎరువుగా మారేందుకు ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల యూరియా చల్లాలని సూచించారు.

# టీపీసీసీ ఎస్సి డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ గా బత్తుల పరశురాములు



**సైదాపూర్ మే 22 ( పీపుల్స్ డైరీ) :** సైదాపూర్. టీపీసీసీ ఎస్సి డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ గా బత్తుల పరశురాములు నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ఎస్సి డిపార్ట్మెంట్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. అట్టి నియామకం వెంటనే అమలులోకి వస్తుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గొల్ల గూడెం గ్రామానికి చెందిన బత్తుల పరశురాములు గత కొన్నాళ్ళు గా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా ఎస్సి సామాజిక వర్గ అభివృద్ధి కి పాటుపడుతున్నారు. ఆయన సేవలను గుర్తించిన ఎమ్మెల్యే సత్యనారాయణ తనను వైస్ ఛైర్మన్ గా నియమించారు. పరశురాములు ఎస్సిల అభివృద్ధి కి పార్టీపరంగా నిర్వహించే కార్యక్రమాలతో పాటు ఎస్సి డిపార్ట్మెంట్ చేపట్టబోయే అభివృద్ధి పనులను అట్టడుగు స్థాయి కి చేరవేయనున్నారు. ఈ సందర్భంగా పరశురాములు మాట్లాడుతూ తన పై నమ్మకం తో ఎస్సి డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ గా నియమించిన ఎమ్మెల్యే సత్యనారాయణ కు కృతజ్ఞతలు తెలిపారు. తన సూచనలను తూచ తప్పకుండా పాటిస్తూ ఎస్సి ల అభివృద్ధి కి పాటుపడుతానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# వివాహిత ఆత్మహత్య



**భీమదేవరపల్లి మే 22:(పీపుల్స్ డైరీ ) :** భర్త అనారోగ్యం కుదుటపడలేదనే మనోవేదనతో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో చోటు చేసుకుంది. ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం...ముత్తారం గ్రామానికి చెందిన పద్మశాలి కులస్థులైన వడ్డేపల్లి లక్ష్మి (55), ఆమె భర్త శాంతయ్య దంపతులు గత కొంతకాలంగా హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో నివసిస్తున్నారు. గత కొన్ని రోజులుగా శాంతయ్య తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. భర్తను రక్షించుకునేందుకు లక్ష్మి అనేక ఆసుపత్రుల చుట్టూ తిరిగింది. ఎంతో డబ్బు ఖర్చు చేసినప్పటికీ భర్త ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు, మనస్థాపానికి గురైన లక్ష్మి.. హైదరాబాద్ నుండి ముత్తారం గ్రామానికి తిరిగి వచ్చింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ముత్తారంలోని తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త వడ్డేపల్లి శాంతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించినట్లు ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికతో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- సంక్షేమ పథకాలకు అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలి.
- జిల్లా అభివృద్ధి లో అందరూ భాగస్వాములు కావాలి.
- జూన్ రెండవ తేదీ నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ల మంజూరు.
- ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు.



**ఏటూరు నాగారం మే 22 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికతో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని, సంక్షేమ పథకాలకు అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలని, జూన్ రెండవ తేదీ నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ల మంజూరు చేస్తామని, ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయబోతున్నమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా స్థాయి సమావేశాన్ని లీలా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర గేయం "జయ జయహే తెలంగాణ" ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని తెలిపారు. 2026 మార్చి 6 నుండి జూన్ 12 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలు పూర్తి చేసుకొని నేడు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మక పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, జిల్లా స్థాయి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మే 18 నుండి 23 వరకు జరుగుతున్న "యువత మరియు క్రీడలు" వారోత్సవాలు స్ఫూర్తితో యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం కింద 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నరకం వడ్లకు బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, పథకాల అమలు చేస్తున్న తీరును వివరించారు. ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం,రోజు విడిచి రోజు రాగి జావ, వేడి పాలు అందించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పిస్తామని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విస్తరిస్తామని, దివ్యాంగ ఇంటర్ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పంట వైవిధ్యీకరణ, సహజ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామన్నారు. అధికారులు ప్రజలతో సన్నిహితంగా మమేకమైతు పారదర్శకతతో పథకాలను అమలు చేయాలని మంత్రి సూచించారు. లబ్ధిదారుల జాబితాను పథకాల వారీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న రామచంద్రపూర్ గ్రామ శివారులోని 10 వేల ఎకరాల పై చిలుకు భూములకు రీ సర్వే నిర్వహించమన్నారు. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించడం జరిగిందని, ఆలయ అభివృద్ధి కోసం 22 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించి నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. ఆలయ పరిసరాలను మరింత సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ములుగు నియోజకవర్గానికి అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించామని, ములుగు జిల్లాలో నూతనంగా 38వేల పైచిలుకు పెన్షన్లను జూన్ రెండవ తేదీన అందించనున్నట్లు తెలిపారు. పథకాల అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి సమస్యలు లేవని ధాన్యం తరలించడానికి లారీలు సరిపడా అందుబాటులో ఉన్నాయని రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ములుగు జిల్లా స్థానిక యువతి యువకులను నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని 80 నుంచి సుమారు 100 ప్రభుత్వ రంగ, ప్రైవేట్ బహుళ జాతి కంపెనీలతో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ములుగు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండే విధంగా కృషి చేయాలని సూచించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కౌన్సిలర్లు గ్రామాల సర్పంచ్ లు గ్రామ అభివృద్ధికి కట్టుబడి కృషి చేయాలన్నారు. ప్రజల సమస్యలను, కష్టాలను, కన్నీళ్లను తుడవడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రామాలు నిరంతరం పరిశుభ్రంగా ఉండే విధంగా చూడడం కోసం పారిశుధ్య కార్మికులను సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. ప్రభుత్వం ఇప్ప చెట్ల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తుందని ఇప్ప పువ్వు తో అనేక లాభాలు ఉన్నాయన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మే 25వ తేదీ నుంచి మహిళా వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పూర్తయిన కార్యక్రమాలు, నిర్వహించిన కార్యక్రమాల వారీగా జరిగిన అభివృద్ధి, వివిధ పథకాల లబ్ధిదారుల సంఖ్యను తెలియజేశారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా ప్రతి అర్హుడికి చేరవేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామసభలలో, ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాలలో స్వీకరించిన వినతులను సత్వరమే పరిష్కరిస్తున్నామని అన్నారు. అధికారులు ఫీల్డ్ స్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాలని, లబ్ధిదారుల జాబితాను పథకాల వారీగా సిద్ధం చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మంత్రి అనసూయ సీతక్క స్త్రీ నిధి ద్వారా 112 మహిళా సంఘాలకు 2 కోట్ల 25 లక్షల రూపాయలను, బ్యాంకు లింకేజి ద్వారా 175 మహిళ సంఘాలకు 16 కోట్ల 15 లక్షల రూపాయలను, ములుగు మున్సిపాలిటీ మెప్మ 25 సంఘాలకు రెండు కోట్ల 2 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 140 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. పెగడపెల్లి, కాసిందేవి పేట, రాయినిగూడెం గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాద్ కేకన్, ఐ టి డి ఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్ రవీందర్ రెడ్డి,ఆర్డీవో వెంకటేష్, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు జాప్యంపై బీజేపీ ఆగ్రహం

**బీజేపీ మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్**

**ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేత**



**భీమదేవరపల్లి, మే 22 (పీపుల్స్ డైరీ) :** ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై బీజేపీ మండల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు శుక్రవారం భీమదేవరపల్లి మండలం తహశీల్దార్ కు పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ భీమదేవరపల్లి మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి వడ్ల కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తరుగు, తేమ నెపంతో రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోళ్లు సాగించాలని, ఐకేపీ సెంటర్లలో రైతులకు కావలసిన కనీస సదుపాయాలను కల్పించాలని కోరారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను అన్ని ఐకేపీ సెంటర్లలో తక్షణమే సమకూర్చాలన్నారు. రైతులకు ఏ చిన్న ఇబ్బంది కలిగినా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఐకేపీ సెంటర్ల ద్వారా రైతులు మక్కలు అమ్మి నెలలు గడుస్తున్నా, ఇప్పటివరకు వారి ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమ కాలేదని శ్రీరామోజు శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ డబ్బులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, భీమదేవరపల్లి, కొత్తకొండ సర్పంచులు మాచర్ల కుమారస్వామి, సిద్ధమల్ల రమా రమేష్, జిల్లా నాయకులు దొంగల వేణు, గుండెల్లి సదానందం, పోడేటి బిక్షపతి, ముద్దసాని వీరన్న, బొల్లంపల్లి శ్యామ్, గద్ద రాజేందర్, బొజ్జపురి పృథ్వీరాజ్, అయిత సాయి తేజ, పయ్యావుల రాజు, బోడ రమేష్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామ ప్రజలందరికీ, ముఖ్యంగా వ్యవసాయద్దారులందరికీ విజ్ఞప్తి..!

**హసన్ పర్తి, మే 22 (పీపుల్స్ డైరీ):** మండుటెండలు, వడ గాలులు ఒక వైపు, మనం పెట్టే మంటలు మరోవైపు. వీటి ఫలితం నిన్న ఆరెపల్లి, గుంటూరు పల్లి, శంబునిపల్లి, బావుపేట గ్రామాల శివార్లలోని వందల ఎకరాల్లో మంటలు చెలరేగి ఊర్లే కాలిపోయే పరిస్థితి వొచ్చింది. ఇందులో ఒక ట్రక్కు బూడిదైపోయింది. చిన్నపిల్లలు సైతం మాంటలార్పడానికి లోటలు, ముంతలతో నీళు పోస్తూ అవస్థలు పడ్డారు. నేను స్వయాన రాత్రి 10:30 గంటలకు సిబ్బందితో యుక్తంగా ఆరెపల్లి- బావుపేట శివార్లలోని పొలాల్లోకి, ఆరెపల్లి రైతులను తీసుకొనిపోయి రోడ్లపైన ఉన్న పచ్చని చెట్ల మండల సాయంతో మంటల వేడికి, పొగకు ఉక్కిరిబిక్కిరవుతూ రాత్రంతా మంటలను ఆర్పడానికి తిప్పలపడ్డాము. ఇందులో నోరు లేని ఎన్నో మూగజీవాలు, మన నోట్లోకి బుక్క రావడానికి ఎనలేని సాయం చేసిన ఎన్నో సూక్ష్మ జీవులు, ఎంతో మంది రైతుల మోటార్లు, గుడిసెలు, విలువైన ఆస్తులు, మన తండ్రులు, తాతలు, పెద్దలు ఎంతో మురిపెంగా నాటిన పచ్చని చెట్లు, మనల్ని భరిస్తున్న భూదేవి అన్నీ బుగ్గిపాలయ్యాయి. ప్రత్యక్షంగా చూసి చలించిపోయిన నాకు నా కళ్ళల్లో తిరిగిన కన్నీళ్లు ఆ మంటల వేడికి చీకట్లోనే ఆవిరైపోయాయి. నాతో పాటు శ్రమించిన చీకట్లో ఎక్కడ బావులున్నాయో, ఎక్కడ గుంతలున్నాయో ఎక్కడ ఏ ప్రమాదం పొంచివుందో కూడా తెలియని నా వెంట ఉన్న సైన్యానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఎనుకట ఈ పనులు మన రైతన్నలు చెయ్యలేదు, ఒకప్పటి లెక్క పల్లెల్లో చల్లదనం కరువైంది, చక్కటి గాలి కూడా నాశనమైంది. దీనికంతటికీ ఒకే ఒక్క కారణం మనం చేసే ఈ ఘనకార్యమే. పొలాల్లో మంటలు వ్యాపిస్తే అక్కడికి ఫైర్ ఇంజన్లు కూడా వెళ్ళలేవు, మంటలార్పడానికి మన మెవలమన్నా ప్రయత్నిస్తే చీకట్లో ఏ బావిలోనో పడే ప్రమాదమూ లేకపోలేదు. నిన్న రాత్రి మాకదే జరిగింది. నా రైతన్నలారా/అక్కలారా మీ ఇష్ట దైవం మీద ఒట్టేసి ఇకనుండి మశీటలు పెట్టను, పెట్టనివ్వనని మాటివ్వండి ఈ భూమి మీద జీవించే హక్కు అందరికీ వుంది అందులో ప్రతీ జీవి వుంటుంది. స్వచ్ఛమైన గాలి, నీరు వాతావరణం దక్కేలా ప్రతీ ఒక్కరం తిప్పలపడాలి. హార్వెస్టర్ల డ్రైవర్లకు చెప్పండి, పంట కోసేటప్పుడు కిందివరకు కొయ్యమని. ఇక చాలు, మంటలు పెట్టే సంస్కృతికి ఇక చరమగీతం పాడుదాం. రైతన్నలు నా ఈ మనోవేదనను అర్థం చేసుకుంటారని మనసారా నమ్ముతున్నా **-మీ ప్రశాంత్ రెడ్డి, ఏ సి పి.**

# మహిళపై గుర్తుతెలియని వ్యక్తి దాడి



**అక్కన్నపేట మండలం: పీపుల్స్ డైరీ మే 22 :** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మంచినీళ్ల బండ గ్రామంలో గురువారం రాత్రి దారుణ సంఘటన చోటుచేసుకుంది. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంట్లో నిద్రిస్తున్న మహిళపై గుర్తుతెలియని వ్యక్తి అత్యంత దారుణంగా దాడి చేసి తలపై కొట్టి మెడలో ఉన్న బంగారం ఎత్తుకువెళ్లారు. ఇది దొంగల పనా లేకుంటే ఎవరైనా చేశారా అని కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కొన ప్రాణాలతో కొట్టుకుంటున్న మహిళ రాజ్యలక్ష్మి ని గ్రామస్తులు 108 లో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సిద్దిపేట సీపీ రేష్మి పెరుమాళ్ ,హుస్నాబాద్ ఏసీ పి సదానందం,సీఐ శ్రీనివాస్, అక్కన్నపేట్ మండల ఎస్సై శాతరాజు ప్రశాంత్, పలు కొనాలలో పోలీసుల విచారణ కొనసాగుతుంది. ప్రశాంతంగా ఉండే పల్లెలో ఈ ఘటన ఒకసారిగా గ్రామాన్ని ఉలిక్కిపడేలా చేసింది. గత కొన్ని రోజులుగా పోలీసులు వేసవి కాలం నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా రాత్రి సమయాల్లో ఉండాలి అని హెచ్చరికలు కూడా జారీ చేశారు. హెచ్చరికలు జారీ చేసిన కొద్ది రోజుల్లోనే ఈ ఘటన జరగడం పోలీసులకు సవాల్ గా మారింది.

# దూసుకెళ్తున్న కాక్రోచ్ జనతా పార్టీ...!బి ఎస్ పి కి వచ్చే ఎన్నికల్లో యువత అండ

- దూసుకెళ్తున్న కాక్రోచ్ జనతా పార్టీ.. యువత మద్దతు మీాకే: రవీందర్ గౌడ్
- పచ్చిమట్ల రవీందర్ గౌడ్
- బిఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి




**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) మే 22 :** హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాలం గడుపుతున్న ప్రభుత్వాలకు యువత తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరుద్యోగులు, ఆర్టీఐ కార్యకర్తలు, జర్నలిస్టులు, లాయర్లపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన అభిజిత్ దుల్కే "కాక్రోచ్ జనతా పార్టీ" పేరుతో సోషల్ మీడియాలో అకౌంట్ ప్రారంభించడం జరిగిందన్నారు. తక్కువ సమయంలోనే ఆ పార్టీకి కోట్ల సంఖ్యలో యువత మద్దతు తెలపడం దేశంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలకు నిదర్శనమని పేర్కొన్నారు.ఆ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలో నిరుద్యోగం, విద్యా వ్యవస్థలో లోపాలు, వైద్య సేవల సమస్యలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, పరీక్షల లీకేజీలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వంటి పలు అంశాలను ప్రస్తావించడం జరిగిందన్నారు. దేశంలో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే యువత కొత్త ఆలోచనల వైపు మొగ్గుచూపుతోందన్నారు.ప్రజా సమస్యలపై ప్రధాన మీడియా, ఈడీ, సీబీఐ వంటి వ్యవస్థలు కూడా సమర్థవంతంగా పనిచేయడం లేదనే భావన యువతలో పెరుగుతోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో యువత పెద్ద ఎత్తున ప్రత్యామ్నాయ రాజకీయాలపై ఆసక్తి చూపుతోందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వం , ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలను విస్మరించారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యువత మద్దతుతో బీఎస్పీ పార్టీ విజయాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, సుధాకర్, శరత్ పాల్గొన్నారు.

# చిగురుమామిడిలో బ్రహ్మం నాటక ప్రదర్శన



**చిగురుమామిడి,మే22 (పీపుల్స్ డైరీ):** రాజన్న పల్లె శ్రీ నాగరాజేశ్వరస్వామి ఆలయం వద్ద జగద్గురు, కాలజ్ఞానకర్త శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన మే 21,22 తేదీలలో అంగరంగ వైభవంగా ప్రదర్శింపబడుతుంది కార్యక్రమ మొదటి రోజు గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్, సీతారాంపూర్ సర్పంచ్ గోగురు మురారెడ్డి, ఉప సర్పంచ్ కాశవేని విజయ రాజు, వార్డు మెంబర్లు పోతర్ల శివాంజనేయులు, పోతరవేని అనిల్ ఆలయ చైర్మన్ గడ్డం రామ్ రెడ్డి, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు వలాస సుభాష్ ఎస్ బి ఎన్ ఛానల్ ప్రతినిధి సొన్నాయిలా భరత్, నల్లవెల్లి సమ్మయ్యలు హాజరయ్యారు ఈ కార్యక్రమం లో స్వామివారి జన్మ రహస్యం, తల్లికి జ్ఞానోపదేశం చేయడం, అచ్చమాంబ వద్ద గోవుల కాయుట,కడప నవాబుకు, ఆనంద భైరవునికి, అన్నాజెయునికి కాలజ్ఞానం చెప్పుట, కాపులకు జ్ఞానోపదేశం చేయుట,పోలేరమ్మతో నిప్పు తెప్పిం చుట తదితర సన్నివేశాలు ప్రదర్శించారు విస్డం చారిటబుల్ ట్రస్ట్ ఎస్ బి ఎన్ ఛానల్ ఆధ్వర్యంలో కళాకారులకు ప్రశంస పత్రాలు అందజేశారు ఇందులో కళాకారులు చిగురుమామిడి కళాకారుల కమిటీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజకుమార్, కుతాడి కొమురయ్య, నిలిగొండ సదానందం, చందబోయిన పరశురాములు, నిలిగొండ కిషన్, పోలోజు కుమార్ స్వామి, అనువోజు శ్రీనివాస్, పోలోజు రమేష్, విశ్వనాథం సత్తయ్య, చొప్పదండి సుధాకర్, మల్లం బాలయ్య, మల్లం శ్రీనివాస్,లోకిని పోచయ్య, అన్వోజు వెంకటాద్రి,నిలిగొండ విష్ణువర్ధని, ముసాపూరి సంపత్ తోపాటు గాగిరెడ్డిపల్లి, ఇందుర్తి, లంబాడిపల్లె, సీతారాంపూర్, సుందరగిరి, రేకొండ, చిగురుమామిడి నవాబుపేట్ గ్రామాల కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశం



**హసన్ పర్తి, మే 22 (పీపుల్స్ డైరీ) :** హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే ఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ చహత్ వాజపేయి కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఐనవోలు, హసన్‌పర్తి మండలాలకు చెందిన 107 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే నాగరాజు పంపిణీ చేశారు. సొంతింటి కలతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం న్యాయం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి గౌరవప్రదమైన జీవితం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్ పంపిణీ చేస్తూ, సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. దివ్యాంగులు స్వయం ఆధారిత జీవితం గడపడానికి అవసరమైన సహకారం అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రజా పాలనలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రతి పేద కుటుంబాన్ని గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో భరోసా నింపుతోందని పేర్కొన్నారు.అనంతరం "బేటీ బచావో - బేటీ పడావో" పోస్టర్‌ను ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ చాహత్ వాజ్పాయ్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి కలిసి ఆవిష్కరించారు. బాలికల రక్షణ, విద్య, సాధికారతపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి అమలు జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్ర జాప్రతినిధులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరి కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

**రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకుల డిమాండ్**




**మేడ్చల్, మే 22(పీపుల్స్ డైరీ):-** మేడ్చల్ పరిధిలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా వెంటనే కొనుగోలు చేసి, రైతులకు పూర్తి మద్దతు ధర చెల్లించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేడ్చల్ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ, రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యం చేతికి వచ్చి రోజులు గడుస్తున్నా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో నిర్వహించకపోవడం దురదృష్టకరమన్నారు. ధాన్యం కొనుగోలులో జరుగుతున్న ఆలస్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు గౌరారం జగన్ గౌడ్ మాట్లాడుతూ అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి మొలకలు వచ్చే ప్రమాదం ఉందని, దీంతో రైతులు భారీ నష్టాలు చవిచూడాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు దళారుల చేతుల్లో మోసపోతున్నారని విమర్శించారు. ఎల్లంపేట మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచుల కొరత, రవాణా సౌకర్యాల లేమి, తూకాలలో అవకతవకలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. రైతులకు ఎలాంటి తరుగు లేకుండా పూర్తి మద్దతు ధర చెల్లించి, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల నుండి వడ్లు కొనుగోలు చేయని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన తీవ్ర ఆందోళనలు, ధర్నాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు చీర్ల సత్యనారాయణ, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శులు జకట ప్రేమ్ దాసు, కానుకంటి వంశీ విజయ్ వంజరి, ఎల్లంపేట మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శులు మహేష్, ప్రకాష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ధాత్రిక లక్ష్మణ్ వంజరి, చెరుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ఉపాధ్యక్షులు సర్వేశ్వర రెడ్డి, మైసరి రాజు వంజరి, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ కార్యదర్శి విష్ణు గౌడ్, జిల్లా బీజేవైఎం నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేవైఎం నాయకులు మహేష్, నాయకులు జకట బాబు రాజు, ఎన్.ఎస్. గౌడ్, పురుషోత్తం, బొజ్జ వంశీ, బాబు గౌడ్, రతన్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ భవన నిర్మాణంలో నిర్లక్ష్యం

**అంబాల రాజు సర్పంచ్**

**ఎల్కతుర్తి మే 22 (పీపుల్స్ డైరీ) :** గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను మూడు సంవత్సరాలుగా నిర్లక్ష్యంగా కొనసాగిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్ టెండర్‌ను తక్షణమే రద్దు చేసి కొత్త కాంట్రాక్టర్‌కు పనుల బాధ్యతలు అప్పగించాలని ఇందిరానగర్ గ్రామ సర్పంచ్ అంబాల రాజు ప్రభుత్వాన్ని మరియు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.శుక్రవారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ ప్రత్యేక చొరవతో మూడు సంవత్సరాల క్రితం నూతన గ్రామపంచాయతీ భవనానికి మంజూరు లభించిందన్నారు. అయితే టెండర్ పొందిన కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేసి పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు.గ్రామపంచాయతీ కార్యాలయం లేకపోవడంతో ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదు-రవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం కార్యాలయం నిర్వహించేందుకు గ్రామంలో అద్దె భవనం కూడా అందుబాటులో లేక ప్రజాప్రతినిధులు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రస్తుత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని టెండర్ రద్దు చేసి కొత్త కాంట్రాక్టర్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించి గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని గ్రామ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# వరి కొయ్యకాలు తగులబెట్టవద్దు

**రైతులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి**



**సైదాపూర్ మే 22 ( పీపుల్స్ డైరీ ) :** వరి కోతల అనంతరం వరి, మొక్కజొన్న కొయ్యకాలకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి, రైతుల ఆస్తులకు తీవ్ర నష్టం జరుగుతోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.నిన్న గురువారం హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లెలో వరి కొయ్యకాలకు నిప్పు పెట్టడంతో గాలికి మంటలు వ్యాపించి గడ్డి కట్టలతో వెళ్తున్న ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైన ఘటన దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు.అలాగే రవాణా శాఖ బీట్ రిపోర్టర్ వెంకన్న గారి తండ్రి నూనె ముంతల సత్తయ్య గారు వరి కొయ్యలకు నిప్పు పెట్టే సమయంలో మంటలు చెలరేగి పొగ కారణంగా ఊపిరాడక మృతి చెందడం ఎంతో బాధాకరమని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు మరెవరికీ జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.వరి కొయ్యకాలు తగులబెట్టడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నాశనం అవుతాయని, గాలి కాలుష్యం పెరిగి ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా పక్క పొలాలు, చెట్లు, విద్యుత్ లైన్లకు అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు వరి పరకను ట్రాక్టర్ ద్వారా నేలలో కలపడం, పశువుల మేతగా వినియోగించడం, కంపోస్ట్ లేదా సేంద్రియ ఎరువుల తయారీలో ఉపయోగించడం, మష్రూమ్ పెంపకానికి వినియోగించడం, బేలర్ యంత్రాల ద్వారా సేకరించి విక్రయించడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని మంత్రి సూచించారు.వ్యవసాయ శాఖ కూడా పరక కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రోత్సహిస్తోందని, రైతులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రమాదాలను నివారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులను కోరారు.

# అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ..

**శంకర్ స్వరూప దంపతుల పెండ్లి రోజు సందర్భంగా 250 మంది ఉపాధి హామీ కూలీలకు సల్ల ప్యాకేట్లు పంపిణీ**



**వీణవంక మే 22( పీపుల్స్ డైరీ ) :** మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ కూలి పనులలో భాగంగా వేసవి కాలం దృష్టి లో ఉంచుకొని అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో నల్లవెల్లి శంకర్ స్వరూప దంపతులు వారి 30వ పెళ్లిరోజు సందర్భంగా ఈరోజు 250 మంది ఉపాధి హామీ కూలీలకు సల్ల పాకెట్లు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సుంకరి శ్రీనివాసరావు తన చేతుల మీదుగా పంపిణీ చేసి అనంతరం మాట్లాడుతూ నల్లవెల్లి శంకర్ స్వరూప దంపతులు వారి పెళ్లి రోజు సందర్భంగా మా 250 మంది ఉపాధి హామీలకు సల్ల ప్యాకేట్లు పంచడం అభినందనీయమని , ఇలాంటి కార్యక్రమాలను అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపకుడు గోనెల సమ్మన్న ముందుండి నడిపిస్తున్నందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ మా వంతు సహాయ సహకారం ఎల్లవేళలా గ్రామ ప్రజలకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, 9 వార్డు సభ్యులు గంధం ప్రశాంత్,ఫీల్డ్ అసిస్టెంట్ మోరె మహేష్, అమ్మ ఫౌండేషన్ సభ్యులు గుమ్మడి సంపత్ రాయణవేణి సంపత్,పూదరి సమ్మయ్య,గోనెల పెద్ద సమ్మయ్య గోనెల నర్సయ్య,కర్రె మల్లికార్జున్,గోనెల నడిపి సమ్మయ్య పూదరి హారీష్ దూలం గోపి,దూలం కనుకయ్య,రాయణవేణి కనుకయ్య ఉపాధి హామీ కూలీలు తది తరులు పాల్గొన్నారు.

# పుస్కర భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగవద్దు

**ఆయా శాఖల అధికారులు అప్రమత్తం గా ఉండాలి..**

**భూపాలపల్లి మే 22 పీపుల్స్ డైరీ..** సరస్వతి అంత్య పుష్కరాలు సందర్భంగా శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో భక్తులు పుష్కర స్నానాలు చేసేందుకు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.పుష్కర ఘాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ఆరోగ్య సేవలు, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న నేపధ్యంలో వాహనాలు రద్దీ, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వాహనాలు క్రమబద్ధీకరణ, రద్దీ నియంత్రణకు పోలీసు, రవాణా, దేవాలయంలో భక్తులు క్యూ పాటించుట, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతి రాజ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎండ దృష్ట్యా భక్తులు తెల్లవారుజాము నుండే వచ్చే అవకాశం ఉందని అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన విధుల్లో అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

# మొలుగూరి లక్ష్మికి ఘనంగా నివాళులర్పించిన...

**బీఎస్పీ హుజురాబాద్ ఇంచార్జీ డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు)**



**జమ్మికుంట. మే 22పీపుల్స్ డైరీ :** బీఎస్పీ సీనియర్ నాయకులు మొలుగూరి శ్రీనివాస్ తల్లి, మొలుగూరి లక్ష్మి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మరణించగా జమ్మికుంట మోత్కులగూడెం లో శుక్రవారం బిఎస్పి నాయకులు వెళ్లి ఆమె చిత్రపటానికి ఘన నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు దొడ్డె సమ్మయ్య,మారపల్లి మొగిలయ్య , బిసి నాయకులు మామిండ్ల మల్లయ్య,సోషల్ మీడియాడమీడియా ఇంచార్జ్ మంద జగన్,దళిత నాయకులు, దళితరత్న అవార్డు గ్రహీత, సరిగొమ్ముల మనోహర్ తదితరులు పాల్గొన్నారు..

## సర్పంచ్ భర్త స్వామిని పరామర్శించిన..

**కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి**



**తొగుట, మే 22 :** తొగుట మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ కళావతి భర్త స్వామి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి స్వామిని పరామర్శించారు. ఈ సందర్భంగా స్వామి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు ఉప్పలయ్య, సోలిపేట ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సూర్యఘర్ పథకానికి తొగుట గ్రామం ఎంపిక



**తొగుట, మే 22 :** దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట మండల కేంద్రం గ్రామమైన తొగుటకు అరుదైన గుర్తింపు లభించింది. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద సుమారు 800 ఇళ్లపై సోలార్ వ్యవస్థల ఏర్పాటు కోసం తొగుట గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పాగాల శోభా కొండల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిలకు మండల ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా గ్రామ ప్రజలకు ఉచిత విద్యుత్ వినియోగంలో ఉపశమనం కలగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, సర్పంచులు రాంపురం రమేష్, లచ్చోళ్ల రవీందర్, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు ఉపేందర్, ఉపసర్పంచులు గౌస్, తిరుపతి, డైరెక్టర్లు బాలమల్లు, ఆన్సర్, నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, శ్రీనాకర్ రెడ్డి, మల్లారెడ్డి, మహిపాల్ రెడ్డి, భరత్ తేజ, పోచయ్య, రవీందర్, బాల్ రెడ్డి, నరసింహులు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పాక్స్ కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించిన హరికిషన్ రెడ్డి



**తొగుట, మే 22:** తొగుట మండలంలోని లింగంపేట, కాన్గల్, రాంపూర్, తొగుట ప్రధాన కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, వరి కొనుగోలు కేంద్రాలను పాక్స్ చైర్మన్ హరికిషన్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల నిర్వహకులతో కలిసి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. అధికారులు, సిబ్బంది అందరూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని అన్నారు. లారీల కొరత కారణంగా వరి రవాణాలో ఆలస్యం జరుగుతోందని రైతులు ఆయన దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి రవాణా సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే వర్షాలు పడే అవకాశం ఉన్నందున మిల్లుల వద్ద ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని మిల్లు యజమానులను కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు యాదగిరి, డైరెక్టర్ శ్రీధర్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజేష్, కేంద్రాల నిర్వాహకులు స్వామి, హుస్సేన్, ప్రకాశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశంలో పాల్గొన్న..

**దుబ్బాక చెరుకు శ్రీనివాస్ రెడ్డి**



**తొగుట, మే 22 :**తొగుట మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులు ఆయనకు శాలువాతో ఘనంగా సత్కారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గంలో ఇల్లు లేని పేద కుటుంబం లేకుండా చేసే వరకు విశ్రాంతి తీసుకోబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, సర్పంచులు పాగల శోభా కొండల్ రెడ్డి, రాంపురం రమేష్, లాచోళ్ల రవీందర్, ఉపసర్పంచులు అమరేందర్, తిరుపతి, గౌస్, డైరెక్టర్ నరసింహారెడ్డి, నాయకులు భూపాల్ రెడ్డి, శ్రీనకర్ రెడ్డి, మల్లారెడ్డి, మహిపాల్ రెడ్డి, భరత్ తేజ, రవీందర్, నర్సింలు, ఉపల్లయ్య, ప్రసాద్ రెడ్డి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత రైతు కులీ సంఘం,ఏఐకేఎంఎస్ మండల మహాసభ ప్రారంభం



**ఆళ్ళపల్లి మే 22(పీపుల్స్ డైరీ) :** అఖిల భారత రైతు కులీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆళ్లపల్లి మండల మహాసభ పూనెం రంగయ్య,మెస్ గోపాల్,వాగబోయిన రాంబాబు అధ్యక్షతన శుక్రవారం ఆళ్లపల్లిలో జరిగింది. ఈ సభను ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు తుపాకుల నాగేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారత రైతుల ఎడల వారి మునగడ పై బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. వ్యవసాయ మార్కెట్లను కార్పోరేటర్లకు దార దత్తం చేస్తున్నారని అన్నారు.దేశంలో వ్యవసాయాన్ని కాపాడు కోవడం, దేశాన్ని రక్షించుకునే బాధ్యత రైతాంగం పై ఉందని అన్నారు. రైతులను సమీకరించి మిలిటెంట్ పోరాటాలకు ఏఐకేఎంఎస్ సిద్ధం చేస్తుందని అన్నారు. ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ తప్పుడు విధానం వలన మొక్కజొన్న,వరి ధాన్యం కొనుగోలులో సంక్షోభం ఏర్పడిందని అన్నారు.మద్దతు ధర ప్రకటించిన కేంద్రం కొనుగోలుకు నిధులు కేటాయించకపోవడం వలన రైతులు కింటాకు 600నుంచి 800రూపాయలు నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి గింజకు మద్దతు ధరను రైతుకు అందే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఇంకా ఈసభలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి ప్రసంగించారు.సభ ప్రారంభం ముందుగా మెస్ గోపాల్ జెండా ఆవిష్కరించారు. అమరవీరులను స్మరిస్తూ ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక మహాసభలో మండల నూతన కార్యవర్గాన్ని 15మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొమరం సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మెస్ గోపాల్,బొర్ర వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా పూనెం రంగయ్య, సహాయ కార్యదర్శులు గా వాగబోయిన రాంబాబు, గొగ్గెల బొజ్జయ్య, కోశాధికారిగా బత్తిని సత్యం, కార్యవర్గ సభ్యులుగా తోట వీరభద్రం, పూసం రాంబాబు,ఈసం ఎల్లయ్య,పూనెం రమేష్,పూనెం బతకయ్య, బొమ్మెర్ల సమ్మయ్య,ఇస్లావత్ రామదాసు లను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీని జిల్లా ప్రధానకార్యదర్శి ఏనుగు చంద్ర రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త.. యాజమాన్యంతో చర్చలు సఫలం

**పలు కీలక డిమాండ్లకు ఆమోదం**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, మే 22 :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ యాజమాన్యంతో నిర్వహించిన చర్చలు విజయవంతమయ్యాయని, ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన సిబ్బందికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను యాజమాన్యం అంగీకరించిందని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి మౌలానా తెలిపారు. చర్చల అనంతరం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం 2017 భత్యాలు, అదనపు ప్రయోజనాలను 80 శాతం వరకు పెంచేందుకు యాజమాన్యం అంగీకరించిందని, అలాగే 2021 వేతన సవరణను 11 శాతం అమరికతో జూలై 1 నుంచి అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ పోషకుల పథకం కింద ప్రస్తుతం పనిచేస్తున్న మృత ఉద్యోగుల పిల్లలను శాశ్వత ఉద్యోగులుగా మార్చడంతో పాటు, వారి సేవా ప్రాధాన్యత కొనసాగించేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో చేపట్టే నియామకాలను కూడా శాశ్వత ప్రాతిపదికన నిర్వహించేందుకు అంగీకారం లభించిందన్నారు. కార్యాలయ సహాయకుల పరీక్షలో ఉత్తీర్ణులైన వారందరికీ ఈ నెలాఖరులోపు నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సంబంధించిన 2017 వేతన సవరణ బకాయిల చెల్లింపుల కోసం ప్రభుత్వ సహకారంతో రుణం పొందే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అధిక పెన్షన్ దరఖాస్తులు తిరస్కరించబడిన ఉద్యోగుల సమస్యలను పునఃసమీక్షించి, వారికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని యాజమాన్యం తెలిపిందన్నారు. ఉద్యోగుల తల్లిదండ్రులకు పెద్ద ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించే అంశంపై కూడా సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వైద్య చికిత్సల ఖర్చుల పరిమితిని రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచేందుకు అంగీకరించగా గతంలో మాదిరిగానే రెండు నెలలకు సరిపడే మందులను ఒకేసారి అందించనున్నట్లు చెప్పారు.అదేవిధంగా తార్నాక ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకుల కోసం రూ.40 లక్షల వ్యయంతో విశ్రాంతి గది, భోజనశాల నిర్మాణానికి కూడా యాజమాన్యం అంగీకరించినట్లు ఎండి మౌలానా తెలిపారు.

## వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలి-గజ్వేల్ ఆర్డీవోకు బీఎస్పీ నేతల వినతిపత్రం

**కుల వివక్షకు చెక్ పెట్టాలి**



**గజ్వేల్ టౌన్, మే 22 :** సమాజంలో కుల వివక్షతకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న వడ్ల కొనుగోలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు గజ్వేల్ ఆర్డీవో చంద్రకళకు విజ్ఞప్తి చేశారు. బహుజన సమాజ్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రం నేతృత్వంలో ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ కుల వివక్షత ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని అన్నారు. ముఖ్యంగా జగదేవ్‌పూర్ మండలంలోని గ్రామాల్లో కుల బహిష్కరణలు, దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇటువంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా "సివిల్ రైట్స్ డే" కార్యక్రమాలను ప్రతి గ్రామంలో పకడ్బందీగా నిర్వహించి సామాజిక సమానత్వంపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని కోరారు. ఇక రైతుల సమస్యలపై మాట్లాడుతూ వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నెలల తరబడి ఐకేపీ కేంద్రాల వద్ద వడ్లు నిల్వ ఉండిపోవడం లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపులో జాప్యం ఏర్పడుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. మండుతున్న ఎండల్లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్న పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే లారీలను అందుబాటులో ఉంచి కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆర్డీవోను కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఆర్డీవో చంద్రకళ సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండనోళ్ల నరేష్, అసెంబ్లీ ఇంచార్జ్ మొండి కరుణాకర్, అసెంబ్లీ అధ్యక్షుడు కొమ్ము చంద్రం, ఉపాధ్యక్షులు బయ్యారం శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కనక ప్రసాద్, శరదని రాము, కర్రోళ్ల నవీన్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే లక్ష్యం

**బీరంగూడ గ్రామ కమిటీ సమావేశంలో అడెల్లి రవీందర్**



**పటాన్చెరు, మే 22 :** బీరంగూడ గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని బీరంగూడ గ్రామ అధ్యక్షులు అడెల్లి రవీందర్ పేర్కొన్నారు.శుక్రవారం ఆయన అధ్యక్షతన గ్రామ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా సైబరాబాద్ మునిసిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.శుంబుణికుంట చెరువు అభివృద్ధితో పాటు స్మశానవాటిక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. అలాగే శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం పవిత్రతకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మహాశివరాత్రి వంటి దైవ కార్యక్రమాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయం పరిసరాల్లో నిర్మాణాలు జరగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతి ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు.ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు పిర్జపతి సత్యనారాయణ, నక్కల కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి చిన్న వీరేశం, కోశాధికారి బంటు శివ, కార్యదర్శి దండు జ్ఞానేశ్వర్, కార్యవర్గ సభ్యులు బంటు ప్రవీణ్, కుహది ప్రభాకర్, ఎడ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బికేఆర్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, మే 22 :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 296వ డివిజన్ దుండిగల్‌కు చెందిన కే. అశోక్ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా స్టేట్ ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి బికేఆర్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించారు. బికేఆర్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేసిన సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ బికేఆర్ ఫౌండేషన్ ఆరోగ్య శిబిరాల నిర్వహణతో పాటు ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తుందని ప్రజలకు పార్టీ కార్యకర్తలకు తమ ఫౌండేషన్ ద్వారా భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, దొంతి మహేష్, కృష్ణ యాదవ్, బికేఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ..

**ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు ను ప్రోత్సహించే ఉద్దేశంతో గోద్రెజ్ ఆగ్రో వైట్ సంస్థ సౌజన్యంతో ప్రత్యేక ఆయిల్ ఫామ్ స్టాల్ను ఏర్పాటు చేశారు**



**సంగారెడ్డి ప్రతినిధి, మే 22 :** ఆయిల్ ఫామ్ తోటలనుప్రోత్సహించే ఉద్దేశంతో గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ సౌజన్యంతో ప్రత్యేక ఆయిల్ పామ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ ఆరోగ్యశాఖ మంత్రివర్యులు శ్రీ దామోదర రాజనర్సింహ హాజరై స్టాల్‌ను సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన వివరాలను జిల్లా ఉద్యాన అధికారి శ్రీ పి. సోమేశ్వరరావు మంత్రి గారికి వివరించారు. రైతులకు స్థిరమైన మరియు అధిక ఆదాయాన్ని అందించే పంటగా ఆయిల్ పామ్‌ను ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నదని వారు తెలిపారు. రైతాంగాన్ని ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు.అదేవిధంగా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పంట కొనుగోలు చేయడం జరుగుతుందని, పంటకు సంబంధించిన చెల్లింపులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులను మరియు రైతాంగాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
శనివారం, 23 మే 2026
సంపుటి : 18, సంచిక : 83


# ఐఏఎస్‌ల పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?

- సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు
- న్యాయస్థానంలో పలువురు పిటిషన్లు దాఖలు
- రిజర్వేషన్ల కోటా నుంచి బయటకు రావాలన్న కోర్టు



**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** దేశంలో రిజర్వేషన్లపై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వెనుకబడిన తరగతులలో (బీసీ) ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థానాలకు చేరుకున్న కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను నిరంతరం పొడిగించడంపై పలు ప్రశ్నలను లేవనెత్తింది. కోటా ద్వారా సామాజిక పురోగతి సాధించిన కుటుంబాలు, కాలక్రమేణా రిజర్వేషన్ వ్యవస్థ నుంచి వెలుపలికి రావాలని కోర్టు మౌఖికంగా అభిప్రాయపడింది. ఫలాలు అందుకుని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నతస్థితికి చేరిన కుటుంబాలు.. అదే కోటాను తరతరాలుగా కోరుకోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

"తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్‌లై.. ప్రభుత్వ సర్వీసుల్లో కొనసాగి స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా అవసరమా?" అని సుప్రీం కోర్టు పలు ప్రశ్నలు సంధించింది. ఓబీసీ క్రిమీలేయర్ (ధనికవర్గం) పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

జస్టిస్ బీవీ నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారకత ద్వారా సమాజంలో ఒక స్థాయి వస్తుందని పేర్కొన్నారు. "తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులు.. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడి ఉన్నతస్థానానికి చేరుకుని, వారిలో సామాజిక పురోగతి స్పష్టంగా కనిపిస్తోంది. ఇటువంటి వారందరినీ రిజర్వేషన్ల నుంచి మినహాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. కానీ, ఆ మినహాయింపులను వారు సవాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని కూడా మనం మనసులో ఉంచుకోవాలి.. రిజర్వేషన్ల ద్వారా ప్రయోజనం పొంది ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కూడా వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరైంది కాదు... ఇలాగైతే రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి మనం ఎప్పటికీ బయటపడలేం.. దీనిని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది" అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు.

ఈ కేసులో పిటిషనర్ల తరఫున హాజరైన సీనియర్ లాయర్ శశాంక్ రత్నూ .. సదరు వ్యక్తులను వారి జీతం ఆధారంగా కాకుండా, వారి హోదా ఆధారంగా మినహాయించారని తెలిపారు. దీనిపై లోతైన పరిశీలన అవసరమని, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కేటగిరీకి, క్రీమీలేయర్‌కు మధ్య స్పష్టమైన తేడా ఉండాలని కోరారు. దీనికి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో సామాజిక వెనుకబాటుతనం ఉండదని, కేవలం ఆర్థిక వెనుకబాటుతనం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. అయితే, లాయర్ శశాంక్ ఈడబ్ల్యూఎస్ కంటే క్రీమీలేయర్ పరిమితి నిబంధనలు చాలా సరళంగా ఉండాలని, రెండింటినీ ఒకేలా చూస్తే వాటి మధ్య తేడా లేకుండా పోతుందని వాదించారు.



# ఇంట్లో కూర్చుంటే పదవులు ఎలా వస్తాయి?

- రాజకీయం చేయాలనే కసి ఉండాలి
- తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి

**పీపుల్స్‌డైరీ-హనుమకొండ :** ఇంట్లో కూర్చుంటే పదవులు రావని, రాజకీయంగా రాణించాలంటే పదవులకు పోటీ చేసి సత్తా చాటాలని, అప్పుడే పద్మశాలీల్లో నవ సమాజ నిర్మాణం జరుగుతుందని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి వ్యాఖ్యానించారు. హనుమకొండ లోని వీ గ్రాండ్ కన్వెన్షన్ హోలులో ఏర్పాటుచేసిన తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా ప్రత్యేక సమావేశం కు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు కవర్తపు మురళి పద్మశాలి కులస్తులను చైతన్యపరిచే విధంగా కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీ వర్గంలో 13 శాతం జనాభా ఉన్న మనం దానికి తగ్గట్లుగా రాజకీయంగా లేవని, కార్పొరేటర్, జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ కావాలంటే మంత్రులతో, ఎమ్మెల్యేలతో కొంతకాలం జర్నీ చేసి కష్టపడ్డప్పుడే రాజకీయంగా ఎదుగుతామన్నారు. పద్మశాలి కులం నుండి ఎవరైనా రాజకీయ పదవికి నిలబడితే మనోళ్లే ఓట్లు వేయడం లేదని, సిరిసిల్లలో కేటీఆర్, మంగళగిరిలో నారా లోకేష్ ఎట్లా గెలిచాడని అక్కడ పద్మశాలి రా ఓట్లు లేవా అని ప్రశ్నించారు. మనకు అవకాశం వచ్చినప్పుడు నిలబడ్డ పద్మశాలి ముద్దుబిడ్డ కు నువ్వు ఓట్లేసి చూడు దిమ్మ తిరిగి గుబగుయ్యమని తీర్పు వస్తుందని అప్పుడే మన పద్మశాలిల తడాఖా ఏందో తెలుస్తుందని అన్నారు.

మొండితనంతో ముందుకు సాగాలని, కింది స్థాయి నుండి రాజకీయంగా ఎదగాలని గుర్తు చేశారు. మనోళ్లు ఎక్కడైనా ఏ పదవి కన్నా నిలబడితే మనమంతా భాగస్వాములై గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్, రాష్ట్ర నాయకులు వైద్యం రాజగోపాల్, తవుటం రవీందర్, కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ రాణి హనుమకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం,ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేష్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొప్పరి వెంకట హరికిషన్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, పొట్టబత్తిని విజయ్,బింగి సతీష్, మేకల జనార్ధన్, డి ఎస్ మూర్తి, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు.



# భారత్‌కు ఎబోలా ముప్పు?


- కేంద్రం కీలక మార్గదర్శకాలు జారీ!
- విమానాశ్రయాల్లో హెల్త్ స్క్రీనింగ్ తప్పనిసరి
- నిఘాను మరింత కఠినతరం చేసిన ప్రభుత్వం

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా మళ్లీ కలవరం రేపుతున్న ప్రాణాంతక ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎబోలా తీవ్రత ఎక్కువగా ఉన్న ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణీకుల కోసం కేంద్ర ఆరోగ్య శాఖ సరికొత్త హెల్త్ అడ్వైజరీని జారీ చేసింది. వైరస్ ప్రభావిత ప్రాంతాల నుంచి నేరుగా వచ్చే లేదా ఆయా దేశాల మీదుగా ట్రాన్సిట్ ద్వారా ఇండియాలోకి అడుగుపెట్టే ప్రయాణీకుడికి విమానాశ్రయాలలో హెల్త్ స్క్రీనింగ్‌ను తప్పనిసరి చేస్తూ నిఘాను మరింత కఠినతరం చేసింది. ఇప్పటివరకు దేశంలో ఎలాంటి ఎబోలా కేసులు నమోదు కాలేదని అధికారిక వర్గాలు స్పష్టం చేసినప్పటికీ.. ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నారు.

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ జారీ చేసిన ఈ తాజా అడ్వైజరీ ప్రకారం.. ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు తమ ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి ముందే ఎయిర్‌పోర్ట్ హెల్త్ అథారిటీస్‌కు తమ ట్రావెల్ హిస్టరీని, ఆరోగ్య పరిస్థితిని స్వయంగా నివేదించాల్సి ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్వో) నివేదికల ఆధారంగా డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ వంటి ఆఫ్రికా దేశాలను 'హై-రిస్క్' దేశాలుగా కేంద్రం వర్గీకరించింది. ఢిల్లీతో పాటు దేశంలోని ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఎయిర్‌పోర్ట్ హెల్త్ ఆర్గనైజేషన్ ద్వారా ఈ నిబంధనలను బోర్డులపై ప్రముఖంగా ప్రదర్శిస్తున్నారు.

**ప్రయాణీకులు గమనించాల్సిన ఎబోలా లక్షణాలు ఇవే!**

ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు తమ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించుకోవాలని, ఒకవేళ కింద పేర్కొన్న లక్షణాలు కనిపిస్తే వెంటనే అధికారులను సంప్రదించాలని కేంద్రం స్పష్టం చేసింది. లితీవ్రమైన జ్వరం లినీరసం, విపరీతమైన అలసట లితలనొప్పి, కండరాల నొప్పులు లివాంతులు, విరేచనాలు లిగొంతు నొప్పి లిశరీరం నుంచి అకస్మాత్తుగా రక్తం స్రవించడం ఎబోలా అనుమానిత లేదా ధ్రువీకరించబడిన రోగి రక్తం, శారీరక ద్రవాలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్న ప్రయాణికులు ఎటువంటి ఆలస్యం లేకుండా విమానాశ్రయ ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలి. ఈ వైరస్ ఇంక్యుబేషన్ పీరియడ్ 21 రోజులు కాబట్టి, ఇండియాలోకి అడుగుపెట్టిన 21 రోజుల లోపు ఎలాంటి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి తమ ట్రావెల్ హిస్టరీని వెల్లడించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.




# త్రివేణి తీరాన భక్తి ప్రవాహం..













(మొదటి పేజీ తరువాయి)

సైకత లింగాలను తయారు చేసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేస్తూ మొక్కులు తీర్చుకోగా, పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య రుద్రాభిషేకాలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. "హరహర మహాదేవ", "జై సరస్వతి మాత" నినాదాలతో ఘాట్‌ల పరిసరాలు మార్మోగిపోయాయి. ఎటుచూసినా భక్తుల రద్దీ కనిపించడంతో కాళేశ్వరం క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తాగునీరు, వైద్యశిబిరాలు, క్యూ లైన్లు, భద్రతా ఏర్పాట్లు కల్పించడంతో పాటు ఘాట్‌ల వద్ద పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు. పుష్కరాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తి గీతాలు, శివనామస్మరణలు వినిపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పుణ్యస్నానాల కోసం భక్తుల రాక మరింత పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు.











## విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసా చారి ఏకగ్రీవ ఎన్నిక



**భూపాలపల్లి, మే 22 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా వీణవంక శ్రీనివాసా చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు బిక్షపతి అధికారికంగా ప్రకటిస్తూ నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సమాజంలో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. ఈ నెల 17న భూపాలపల్లి జిల్లాలో నిర్వహించిన సంఘం సమావేశంలో మండలాల అధ్యక్షులు, జిల్లా కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలోని వివిధ మండల కమిటీల ప్రతినిధులు ఏకగ్రీవంగా వీణవంక శ్రీనివాసాచారిని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర నాయకులు ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు వీణవంక శ్రీనివాసాచారి మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణుల ఐక్యత, సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. సంఘ బలోపేతానికి ప్రతి మండలంలో సభ్యత్వ విస్తరణ చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శృంగారం భాస్కరాచారి, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కురిమిల్ల రమేష్‌తో పాటు భూపాలపల్లి జిల్లా సీనియర్ నాయకులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వేం సన్మాన సభకు తరలిరండి! : రాజనాల శ్రీహరి



**మట్టెవాడ, మే 22 (పీపుల్స్ డైరీ) :** ఈనెల 24వ తేదీ ఆదివారం రాజ్యసభ సభ్యుడిగా తొలిసారి ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికి హంటర్ రోడ్డులోని డి కన్వెన్షన్ హాలులో జరిగే సన్మాన కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీహరి మాట్లాడుతూ పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్.యూఐ, మహిళా కాంగ్రెస్, బీసీ సెల్, మైనార్టీ సెల్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజనాల శ్రీహరి కోరారు. వేం నరేందర్ రెడ్డి రెండున్నర సంవత్సరాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విజయ పథంలో నడిపించడానికి కృషి చేశారని అది దృష్టిలో పెట్టుకొని రాహుల్ గాంధీ, సోనియా గాంధీ వారిని రాజ్యసభ సభ్యునిగా నియమించడం జరిగిందన్నారు. సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్, సోలా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం జరుగుతుందని భరోసాని కలిగించాలి!

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్





**మట్టెవాడ, మే 22 (పీపుల్స్ డైరీ) :** పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసాను కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. టాస్క్ ఫోర్స్ నూతన ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బండారి రాజుతోపాటు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కర్రె స్వామి గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకం గా కలుసుకొని మొక్కను అందచేశారు. ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఇరువురు అధికారులకు సీపీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు.

## పెన్షన్ మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ



**మట్టెవాడ, మే 22 (పీపుల్స్ డైరీ) :** ఖిలావరంగల్ తూర్పుకోట వాస్తవ్యులు నలివెల రవీందర్ జయ దంపతుల ఆధ్వర్యంలో తూర్పు కోట పోచమ్మ దేవాలయం ఆవరణంలో వారి నాన్న క్రీ,శే నలివేల అనుమంతు, కూతురు క్రీ,శే నలివెల సహజల జ్ఞాపకార్థం తూర్పుకోటలోని పెన్షన్ తీసుకునే వృద్ధాప్య మహిళలు, వితంతు మహిళలు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, వికలాంగ మహిళలు తదితర 800 మంది మహిళలకు ఉచితంగా పట్టుచీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక 37వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్, నలివెల రవీందర్ – జయ కుటుంబ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొని పెన్షన్ మహిళలందరికీ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నలివెల రవీందర్ జయ దంపతులకు, కార్పొరేటర్ దంపతులకు స్థానిక నాయకులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నలివెల రవీందర్ జయ దంపతుల కుటుంబ సభ్యులు నలివెల రమేష్, నలివేల నరేందర్, స్థానిక నాయకులు ఎసిరెడ్డి రమేష్, బోయిని దూడయ్య, బెడద వీరన్న, సంగరబోయిన చందర్, హర్షం రాంబాబుఓ అల్లం కేశవరాజు, బోలుగడ్డ శ్రీనివాస్, మేకల కుమార్, బంగారు శీను, చుక్క రాజు, సంగాబోయిన రాజేష్, మాదాసి మధు, కలకోట్ల కుమార్, వనపర్తి కరుణాకర్, బొల్ల కిరణ్, పోయిన ప్రసాద్, నలివెల శివకుమార్, నలివెల ఐలయ్య, కిరణ్, ప్రతాప్, కుమార్, రాజమల్లు,రాము, రాజేష్, పెద్ద ఎత్తున పెన్షన్ మహిళలు పాల్గొన్నారు.

# అంతర్‌రాష్ట్ర దొంగలపై రైల్వే స్టేషన్లలో పోలీస్ నిఘా!

### 4 ప్రత్యేక బృందాల ఏర్పాటు

### నిరంతరం అనుమానితుల తనిఖీ



**మట్టెవాడ, మే 22 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత కొద్ది రోజులుగా ఇతర రాష్ట్రాల నుండి ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన నేరగాళ్ళు ఇళ్ల చోరీలతో పాటు, చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్ప డినట్లు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ కావడం, ముఖ్యంగా దేశంలోని అన్ని రాష్ట్రాలను కలుపుతూ కేంద్ర బిందువుగా వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు మారడంతో నేరగాళ్ళు రైలు మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకోని పలు చోరీలకు పాల్పడటం, అనంతరం నిందితులు ఇదే రైలు మార్గం ద్వారా తిరిగి వారి స్వస్థలాలకు చేరకుంటున్నారు. ఇలాంటి నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అంతర్ రాష్ట్ర దొంగలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా అంతర్‌రాష్ట్ర దొంగలను ముందుగా గుర్తించ డం అలాగే చోరీల కట్టడికై రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా క్రైమ్స్ అదనపు డిసిపి బాలస్వామి, సిసిఎస్ ఏసిపి సదయ్య ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. రెండు బృందాల చొప్పున వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో విధులు నిర్వహిస్తారు. దేశంలోని వివిధ మార్గాల ద్వారా ముఖ్యంగా ఉత్తర భారత దేశం నుండి వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో ఆగే రైళ్ళలో ఇక్కడికి చేరుకున్న ప్రయాణికుల్లో ఈ ప్రత్యేక పోలీస్ బృందం సభ్యులు అనుమానిత ప్రయాణికులను గుర్తించి వారిని, వారి సామగ్రిని సైతం కుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు వారి నుండి పూర్తి వివరాలను సేకరించిన అనంతరం ఈ ప్రత్యేక పోలీస్ బృందం సభ్యులు అనుమానిత వ్యక్తుల సంబంధిత వేలి ముద్రలు, ముఖాలను ఫేస్ రికగ్నైజేషన్‌తో పాటు పోలీసుల వద్ద వున్న ఆధునిక పరిజ్ఞానంతో దేశంలోని నేరస్థులకు సంబంధించిన డాటా బేస్‌తో అనుసంధానం చేసి సంబంధిత అనుమానిత వ్యక్తులను పరీక్షించడం జరుగుతుంది. ఈ తనిఖీల్లో ఒకవేళ తనిఖీ చేసిన వ్యక్తి గతంలో ఏదైనా నేరానికి పాల్పడినట్లయితే క్షణాల్లో పోలీసులు వినియోగిస్తున్న టెక్నికల్ డివైజ్‌కు అనుమానితుడి పూర్తి వివరాలు చేరిపోతాయి. దీనితో తక్షణమే పోలీసులు అప్రమత్తమై సదరు అనుమానితులను అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరుగుతుంది. ఇదే సమయంలో ఈ బృందాలు తనిఖీలు చేసే సయమంలో అనుమానిత పూర్తి వివరాలను సైతం రికార్డుల రూపంలో భద్రపరచడం జరుగుతుంది. నలుగురు సభ్యులు వున్న ప్రత్యేక బృందంలో ప్రతి రైల్వే స్టేషన్‌ల్లో షిఫ్టుల వారిగా విధులు నిర్వహిస్తూ నిరంతరం అనుమానితులను తనిఖీలు నిర్వహిస్తూ అంతరాష్ట్ర దొంగలకు చెక్ పెడుతున్నారు వరంగల్ కమిషనరేట్ పోలీసులు.

# ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలం

### బీజేపీ ఆత్మకూరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి

**ఆత్మకూర్, మే 22 (పీపుల్స్ డైరీ) :** వరిధాన్యం, మొక్కజొన్నలు కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి ఆత్మకూరు మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై తహసిల్దా ర్ జగన్మోహన్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆరుగాలం చెమటోడ్చి. కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంట పండించిన రైతన్న పరిస్థితి రోజురోజుకి దయనీయంగా మారుతుందని, పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల చుట్టూ వారాలు తరబడి తిరుగుతూ రైతులు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం, ముందస్తు ప్రణాళిక లోపం కారణంగా అన్నదాతలు రోడ్డుపై కూర్చునే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే కాంటాలు గన్ని బ్యాగులు, హమాలీలు లారీలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చి ప్రతి గింజను వెంటనే కొనుగోలు చేయాలని. తరుగు, తేమ, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే దళారులపై కొనుగోలులో అవకతవకలకు పాల్పడుతున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చిన నెల రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకపోవడం దుర దృష్టకరమని, ఇకనైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో




జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టు వేణు గౌడ్, ఆర్టీఐ యాక్ట్ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రవణ్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శి రవ్వ శివప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ బలభద్ర దినేష్, కోశాధికారి జక్కుల మహేందర్, వార్డు సభ్యులు కుక్కముడి కిరణ్, రాచర్ల నరేష్, బూత్ అధ్యక్షులు బయ్యా మాలగం, పిట్టల స్వామి, బలభద్ర కైలాసపతి, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత రైతులకు అండగా ఉంటాం

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**చిట్యాల, మే 22 (పీపుల్స్ డైరీ) :** అగ్ని ప్రమాదాల్లో దగ్ధమైన పంటలను భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన సిరిపురం కుమారస్వామి అరటి తోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. అలాగే చల్లగరిగ గ్రామంలో చాడ సమ్మిరెడ్డి పామాయిల్ తోట చిట్యాల గ్రామంలో బాలవేణి వేణు మిరప పంట అగ్ని ప్రమాదాల్లో దగ్ధమైనాయి. టేకుమట్ల మండలంలోని అంకుషాపురం గ్రామంలో చిత్తిరెడ్డి రమణారెడ్డి పామాయిల్ తోట కూడా అగ్ని ప్రమాదంలో దెబ్బతింది. ఈ ఘటనల్లో నష్టపోయిన రైతుల దగ్ధమైన తోటలు మరియు పంట పొలాలను ఎమ్మెల్యే శుక్రవారం సందర్శించి పరిశీలించారు. బాధిత రైతులను పరామర్శించి జరిగిన నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన పంటలకు సంబంధించి విద్యుత్ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో నష్టం అంచనా వేసి రైతుల కు తగిన నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వివిధ అగ్ని ప్రమాదాల్లో దగ్ధమైన పంటలకు ప్రభుత్వం నుంచి కూడా తక్షణ సహాయం, నష్టపరిహారం అందించాలని కోరారు. రైతులు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం అని ఎమ్మెల్యే తెలిపారు. పంట పొలాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తాసిల్దార్ వసంతరావు ఎంపీడీవో జయశ్రీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ సర్పంచ్ ముకిరాల మధువంశీకృష్ణ నాయకులు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## మాజీ జెడ్పిటిసిని పరామర్శించిన బడే నాగజ్యోతి



**గోవిందరావుపేట, మే 22(పీపుల్స్‌డైరీ) :** మండల కేంద్రా నికి చెందిన మాజీ జెడ్పిటిసి తుమ్మల హరిబాబు అనారో గ్యానికి గురై ఇంట్లో చేరదీర్చుకుంటున్నా ఆయనను బి ఆర్ ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి, మాజీ రెడ్కో చైర్మన్ ఏరువా సతీష్ రెడ్డిలు శుక్రవారం తుమ్మల హరిబాబును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట జిల్లా నాయకులు వేములపల్లి బిక్షపతి, గోవిందరావుపేట, మాజీ ఎంపీపీ సుడి శ్రీనివాస్ రెడ్డి,ములుగు మాజీ మండల పార్టీ అధ్యక్షులుసా నికొమ్ము రమేష్ రెడ్డిఏ ట్టి జగదీష్, మాజీ ఎంపీటీసీ మహేష్, పోరికకిరణ్,బొల్లం శివ, సుమన్ మండల పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,



## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే రేవూరి

**ఆత్మకూర్, మే 22 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బండారి మొగిలి మనమరాలు నూతన వస్త్ర పుష్పాలంకరణ కార్యక్రమానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారి సాయి శ్రీ ని ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, పెద్దాపురం సర్పంచ్ రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అర్పణపల్లిలో అంటుకున్న మంటలకు మిర్చి, వడ్లు, పైపులు దగ్ధం

### రైతులకు తీవ్ర నష్టం

**కేసముద్రం మే 21 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామంలో వరి మడిని తగలబెట్టే క్రమంలో అదుపు తప్పిన మంటలు పక్క పొలాలకు వ్యాపించడంతో ముగ్గురు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ప్రమాదంలో అర్పణపల్లి గ్రామ రైతులు చిట్టె కుమారుస్వామి కంచ శ్రీను, చిట్టె కొమురయ్య, లకు చెందిన మిర్చి పంట, ఆరబెట్టిన వడ్లు, నీటి పైపులు పూర్తిగా కాలిపోయి బూడిద అయ్యాయి. కళ్లముందే పంట నాశనం కావడంతో బాధిత రైతులు కన్నీరు పెట్టుకున్నారు. ఎన్నో కష్టాలు పడి పండించిన పంట, పెట్టుబడి అంతా మంటల్లో కాలిపోయిందని, తమను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. నష్టపోయిన తమను ఆదుకొని నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. వరి మడిని తగలబెట్టడం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు ఇలాంటి ప్రమాదాలు జరిగి పక్క పొలాల రైతులు కూడా నష్టపోతున్నారని వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులు మడిని తగలబెట్టవద్దని, భూమిలోనే కలియదున్నాలని సూచించారు.





## ఆలోచన ‘ దృక్పథం’ను పెంపొందిస్తున్న పత్రిక పీపుల్స్ డైరీ : మారపల్లి మల్లేష్

**చిట్యాల, మే 22(పీపుల్స్ డైరీ) :** అనతి కాలంలోనే దమ్మున్న వార్తలు అందిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సామాజిక కర్తవ్యాలను ప్రజలకు తెలుపుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు దిక్సూచిగా పనిచేస్తున్న పీపుల్స్ డైరీ తెలుగు దినపత్రిక పాఠకుల్లో ఆలోచన దృక్పథంను పెంపొందిస్తుందని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ పీపుల్స్ డైరీ తెలుగు దినపత్రిక భావ ప్రకటన స్వేచ్ఛ గీతికగా పనిచేస్తుందని అన్నారు. నైతిక విలువలతో కూడిన జర్నలిజాన్ని అందిస్తున్న ఏకైక పత్రిక పీపుల్స్ డైరీ అన్నారు. సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులను ప్రజలకు అందించడంతో పాటు ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ వాస్తవాలకు ప్రాణం పోస్తూ నిజాలను నిర్భయంగా రాస్తున్న దమ్ము ధైర్యం గల పత్రిక పీపుల్స్ డైరీ అన్నారు.





# ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి

**ఖమ్మం, మే 22 (పీపుల్స్ డైరీ) :** ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం తోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం స్థానిక భక్త రామదాసు కళా క్షేత్రంలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించేందుకు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభ సమయంలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, ఇందిరా మహిళా శక్తి క్రింద బ్యాంకు రుణాలు కల్పన వంటి చర్యలతో పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఖమ్మం జిల్లాలో పూర్తయ్యాయని వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పనిచేస్తే జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ఇటీవల ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు ప్రజలకు మరింత చేరువై సేవలు అందించాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రతి ప్రజాప్రతినిధి వేసవి కాలంలో ఎక్కువ సంఖ్యలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని, పారిశుధ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య చర్యలతో సీజనల్ వ్యాధులను తగ్గించవచ్చని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించనున్నట్లు, పాఠశాల విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నట్లు చెప్పారు. వికలాంగ విద్యార్థులకు బ్యాటరీ ఆధారిత వాహనాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అంతకు ముందుకు ఖమ్మం జిల్లా స్థాయి శాఖల అధికారులు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజలు లబ్ధిపొందుతున్న వివరాలను వెల్లడించారు. రాబోయే ప్రభుత్వ పథకాలను ప్రజలకు కలెక్టర్ సంపూర్ణంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, గ్రామ సర్పంచ్ లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**ఏన్కూరు, మే 22 (పీపుల్స్ డైరీ) :** మండలంలో శుక్రవారం ఉదయం 6:30 లకే ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. మండలంలోని ఏన్కూర్, జన్నారం,టియల్ పేట తదితర ప్రాంతాల్లో ఉపాధి హామీ కూలీలతో పని ప్రదేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె, పనిచేసే కూలీలకు సౌకర్యాలు కల్పించాలని, తాగునీటి సౌకర్యం, షెడ్ నెట్ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి పంచాయతీలో గ్రామ కార్యదర్శి 6 గంటలకు సమయానికి పని ప్రదేశానికి చేరుకుని పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. అదేవిధంగా మండలం లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో భాగ్యశ్రీకి సూచించారు. అనంతరం ఏన్కూర్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం జరిపారు.ఉపాధి పనులు, పెన్షన్లు తదితర సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యశ్రీ, ఏపీడి చలపతిరావు, ఎంపీ ఓ జీవీఎస్ నారాయణ, వివిధ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తుడుందెబ్బ మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**కరకగూడెం, మే 22 (పీపుల్స్ డైరీ) :** గురువారం కరకగూడెం మండల కేంద్రంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో కరకగూడెం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కలం సంపత్ కుమార్ (కలవలనాగారం), ఉపాధ్యక్షులుగా పోలేబోయిన రాంగోపాల్ (రఘునాధపాలెం), కోరగట్ల విశ్వనాథం (పద్మాపురం),ప్రధాన కార్యదర్శిగా తోలెం హరికృష్ణ (తుమ్మలగూడెం),కార్యనిర్వాహక అధ్యక్షులు పోలేబోయిన సర్వేశ్వరరావు (పాపాయిగూడెం) కోశాధికారిగా చందా గణేష్ (చిరుమళ్ళ,),మహిళా కార్యదర్శులు : చందా విజయలక్ష్మి (తాటి గూడెం),వజ్జ అపర్ణ (కొత్తగూడెం),ప్రచార కార్యదర్శులు పోలేబోయిన కృష్ణ (పాపాయిగూడెం) మలకం నరేష్ (గొల్లగూడెం) సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా పోలేబోయిన రోహిత్ (వెంకటా పురం) గౌరవ సలహాదారులు ఊకే గణేష్(కన్నాయిగూడెం), పాయం నరసింహారావు (చిరుమల్ల) (మాజీ సర్పంచ్), కరకగూడెం మండలంలోని అన్ని గ్రామాలు, గూడెశీల సమన్వ యంతో ఈ నూతన కమిటీని తీర్మానించి ఎన్నికున్నారు. ఆదివాసి హక్కుల పరిరక్షణ, జాతి అభివృద్ధి, రాజ్యాంగ హక్కుల సాధన కోసం కమిటీ సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు.

## చంద్రయ్యపల్లిలో మానవత్వం

### మృతుని కుటుంబానికి రూ. 35 వేల ఆర్థిక సాయం



**నర్సంపేట, మే 22 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లి గ్రామస్తులు మరోసారి తమ దాతృత్వాన్ని, మానవత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలనే సదుద్దేశంతో గ్రామంలోని పెద్దలు, యువకులు కలిసి ఏర్పాటు చేసిన 'మన ఫ్యామిలీ' గ్రూప్ ద్వారా మృతుని కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. గ్రామంలో ఎవరైనా ఆకస్మికంగా మరణిస్తే వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలనే సేవా దృక్పథంతో గ్రామస్తులంతా ఏకమై 'మన ఫ్యామిలీ' అనే గ్రూపును క్రియేట్ చేశారు. ఇందులో గ్రామానికి చెందిన ప్రతి ఒక్కరినీ సభ్యులుగా చేరేలా ప్రోత్సహించి, ఒక కుటుంబంలా ఏర్పడ్డారు. ఈ క్రమంలో ఇటీవల గ్రామానికి చెందిన కుక్కమూడు తిరుపతి మరణించడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆ కుటుంబానికి బాసటగా నిలవాలని నిర్ణయించిన 'మన ఫ్యామిలీ' సభ్యులు ఒకరికొకరు తోడుగా నిలిచి విరాళాలు సేకరించారు. ఇలా మొత్తం రూ. 35 వేల రూపాయలను సమీకరించారు. ఈ నిధులతో బాధిత కుటుంబానికి తక్షణ అవసరాల నిమిత్తం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. మిగిలిన నగదును మృతుని ఇద్దరు కుమార్తెల భవిష్యత్తు కోసం వారి పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి గొప్ప మనసు చాటుకున్నారు. కష్టకాలంలో తోటివారికి అండగా నిలుస్తున్న చంద్రయ్యపల్లి గ్రామస్తుల చొరవపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువ నేతలు, కుల పెద్దలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఫొటోగ్రాఫర్ కరుణాకర్ కుటుంబానికి అండగా సమ్మి గౌడ్ ఫౌండేషన్

**కేసముద్రం, మే 22 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం మున్సిపాలిటీ అమీనాపురం ఎస్సీ కాలనీకి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ ఇనుముల కరుణాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బ్రెయిన్‌లో నరాలు చిట్లి రక్తస్రావం కావడంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయనకు భార్య సుజాత, కుమారుడు షాన్, కుమార్తె రక్షిత ఉన్నారు. విషయం తెలుసుకున్న సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య వెంటనే స్పందించి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపి ఫౌండేషన్ తరఫున తక్షణ సహాయంగా క్వింటాల్ బియ్యాన్ని అందించారు. భవిష్యత్తులో కరుణాకర్ పిల్లల చదువులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ, ప్రజల జీవితాల్లోని మధుర జ్ఞాపకాలను కెమెరాలో బంధించిన కరుణాకర్ మరణం బాధాకరమని, మంచి మనసున్న వ్యక్తిని కోల్పోవడం సమాజానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో దండు శ్రీను, కళ్లెం శ్రీను, జన్ను కట్టయ్య, చంటి, శరత్, భాస్కర్, కరుణాకర్, శ్యామ్, అనిల్, కృష్ణ, రాజేందర్ కుమార్, అభిలాష్, సుశీల, యాకమ్మ, స్వర్ణలత, రమ, సరిత, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమిష్టి కృషి చేయాలి

### కేటీకే ఓసీ-3లో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో జీఎం రాజేశ్వర్ రెడ్డి



**గణపురం, మే 22 (పీపుల్స్ డైరీ) :** సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు ప్రతి ఉద్యోగి సమిష్టి బాధ్యతతో పనిచేయాలని భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కేటీకే ఓసీ-3 ప్రాజెక్టు, భూగర్భ గనిలో సింగరేణి సీఎండీ ఆదేశాల మేరకు నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పోటీ పరిస్థితుల్లో యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ భద్రతకు ప్రాధాన్యత ఇస్తూనే ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ప్రతి ఉద్యోగి బాధ్యతగా భావించాలని సూ చించారు. ముఖ్యంగా డీజిల్ వినియోగాన్ని నియం త్రించడంతో పాటు యంత్రాలకు ఆయిల్ లీకేజీలు జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవా లని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, పెరుగుతున్న ఖర్చుల దృష్ట్యా ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించిన జీఎం.. అధికారులు, సూపర్‌వైజర్లు కార్మికులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం అధికారులు, కార్మికులతో కలిసి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా సంస్థ ప్రణాళిక లను అమలు చేస్తూ వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నా రు. ఈ సందర్భంగా అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి ప్రగతి, భవిష్యత్ కార్యా చరణ ప్రణాళికలను వివరించారు. ఈ సమావేశంలో ఎస్ఓ టు జీఎం ఎస్.కవింద్ర, పీఓ బిక్షమయ్య, ఏరియా ఇంజనీర్ రాజారావు, డీజీఎం పి.రాజేశ్వర్, డీజీఎం కృష్ణప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుం దర్, గని మేనేజర్లు రాంబాబు, సునీల్, సంపత్, సంక్షేమ అధికారి సాయికృష్ణ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీ యూసీ, సీఎంఓఏఐ ప్రతినిధులు, వివిధ యూనియన్ నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కేసముద్రంలో అక్షయ డిజిటల్ స్టూడియో ప్రారంభం

### ముఖ్యఅతిథులుగా హాజరైన అల్లం నాగేశ్వర్ రావు, చిలువేరు సమ్మయ్య గౌడ్



**కేసముద్రం టౌన్, మే 22 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం మండల కేంద్రంలోని ఎస్.ఆర్ స్కూల్ గర్ల్స్ ప్రకాష్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అక్షయ డిజిటల్ స్టూడియో ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, కేసముద్రం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు, కౌన్సిలర్ వీరేష్ కలిసి స్టూడియోను ప్రారంభించారు. పూజా కార్యక్రమాల నడుమ జరిగిన ఈ వేడుకకు స్థానిక ప్రజలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి రంగంలో అడుగులు వేయడం సమాజానికి మంచి సంకేతమని అన్నారు. ఆధునిక సాంకేతికతతో ప్రజలకు నాణ్యమైన ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన అక్షయ డిజిటల్ స్టూడియో భవిష్యత్తులో మంచి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడం అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే స్టూడియో యజమానికి ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేస్తూ వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. కార్యక్రమంలో సామల నర్సయ్య, తీగల వెంకటేశ్వర్లు, స్థానిక క్రిష్టియన్ పాస్టర్లు, కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## సీపీఐ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



**నల్లబెల్లి, మే 22 (పీపుల్స్ డైరీ) :** జూన్ 3, 4,5 -2026 తేదీలలో నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్ లో సిపిఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించాలని జిల్లా సమితి నిర్ణయించిందనీ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి అన్న అన్నారు. మండల కేంద్రమైన నల్లబెల్లి సుమంగళీ ఫంక్షన్ హాల్ లో జరిగిన సిపిఐ పార్టీ మండల కమిటీ సమావేశంలో మండల నాయకులు పరికి కోర్నేలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి బట్టు సాంబయ్యతో కలిసి కుమారస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ రాజకీయ ఆర్థిక సామాజిక పరిస్థితులు తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడ్డాయన్నారు.దేశంలో మెజారిటీ ప్రజలైన ఎస్సీ ఎస్టీ బీసీలు మైనార్టీలు, వ్యవసాయ కార్మికులు రైతులు అసంఘటిత రంగ కార్మికులు, చిన్న మధ్యతరహా వ్యాపారులు తీవ్ర ఆర్థిక సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా కేంద్రం చేసిన అప్పు 200 లక్షల కోట్లు, రాష్ట్ర అప్పు 10 లక్షల కోట్లకు చేరువలో ఉన్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఈ అప్పులు దుబారా కారణంగా నిత్యవసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. అన్ని రంగాలలో అవినీతి,కల్తీ పెరిగిపోతుంది. ప్రజల కొనుగోలు శక్తి రోజురోజుకు తగ్గిపోతుంది. గ్రామీణ,పట్టణ బస్తీలలోని యువతకు ఉపాధి అవకాశాలు క్షీణిస్తున్నాయి. యువత పట్టణ ప్రాంతాలకు వలసలు పోతున్నారున్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు లేక,మార్కెటింగ్ సౌకర్యాలు లేక, కొనే నాథుడు కరువై,కల్తీ విత్తనాలు ఎరువులు పురుగుమందుల వల్ల వ్యవసాయ రంగం కుదేలవుతుందన్నారు.మోడీ తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలు ఉపసంహరించుకోవాలనీ ఢిల్లీ సరిహద్దులలో 1200 రోజులుగా లక్షలాది మంది రైతులు ఆందోళన చేయవలసి వచ్చింది.రైతుల మీదికి వాహనాలు ఎక్కించారు.750మంది రైతులు ఆ ఆందోళన సందర్భంగా ప్రాణాలు వదిలారు.హిందుత్వ పేరుతో పాలన చేస్తున్న బిజెపి మోడీ ప్రభుత్వం హిందువులలో 60,శాతం గా ఉన్న బీసీలకు విద్యా ఉపాధి రంగాలలో వారి వాటా ప్రకారం ప్రభుత్వ , ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు కల్పించకుండా బీసీలకు వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేక నిరాశ, నిస్పృహలతో ఆత్మహత్యలు, నేరాలు పెరుగుతున్నాయి .మరోవైపు ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న యువతకు ఉద్యోగాలు తొలగించబడుతూ ఉద్యోగ భద్రత కోల్పోతున్నారు. మహిళలపై అత్యాచారాలు దాడులు హత్యలు చైన్ స్నాచింగ్‌లకు ఈ నిరుద్యోగ సమస్యే కారణమౌతుంది. ఈ జిల్లా శిక్షణ తరగతులలో జిల్లాస్థాయి కేడర్ నాయకులు 200 మంది వరకు పాల్గొంటారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు ఈ శిక్షణ శిబిరాలను ప్రారంభిస్తారన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా తదితర జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు పాల్గొంటా రన్నారు. ఈ శిక్షణ తరగతులను జయప్రదం చేయడానికి అన్ని సామాజిక వర్గాల ప్రజలు ఆర్థిక హార్దిక సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల నాయకులు మామిండ్ల పెద్ద ఐలయ్య కందిక రమేష్ కడియాల క్రాంతి కుమార్ ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి మత్రి రమేష్, నాయకులు ఓదెల రవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజల ఐక్యతతోనే ఆదర్శ గ్రామంగా సాధ్యమవుతుంది : సర్పంచ్ స్వరూప



**గోవిందరావుపేట, మే 22 (పీపుల్స్ డైరీ) :** గ్రామ ప్రజల ఐక్యతతోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకోవచ్చని సర్పంచ్ కుంజా స్వరూప అన్నారు. మండలం పరిధి ముత్తాపూర్ గ్రామంలో శుక్రవారం బాలవికాస ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణం పై గ్రామ సభ నిర్వహించినట్లు సర్పంచ్ కుంజ స్వరూప తెలిపారు. ఈ గ్రామసభ జరిగింది, బాలవికాస ఆదర్శ గ్రామం పథకం మేనేజర్ మంజుల సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత లు మాట్లాడుతూ ఆదర్శ గ్రామం అంటే రోడ్డు,భవనాలు నిర్మించుకోవడం కాదని అన్నారు,వినూత్న కార్యక్రమాలను చేపడుతూ క్రమశిక్షణతో గ్రామ ప్రజలందరూ కట్టు బాట్లు,నియమాలు పద్ధతులు ద్వారానేవాటిని పాటిస్తూ గ్రామ ప్రజల ఐక్యముతో ఉంటే ఆదర్శ గ్రామం గా తీర్చిదిద్దుకోవచ్చని అన్నారు,ఆదర్శ గ్రామము అంటే అర్థం కావాలని డబ్బులుంటే అభివృద్ధి చేసుకోవచ్చు కానీ ఆదర్శ గ్రామమంటే ప్రజలందరూ ముందుకు వచ్చి సమిష్టి అవగాహన ఏకాభిప్రాయంతో ఉన్న వనరులను గుర్తించి వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. సర్పంచ్ కుంజా స్వరూప మా గ్రామంలో బాల వికాసం సంస్థ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమానికి గ్రామపంచాయతీ నుండి పూర్తి సహకారం అందిస్తాము అన్నారు. బాలవికాస ఆదర్శ గ్రామ నిర్మాణ పథకంలో గ్రామాన్నిఎన్ను కోవడం చాలా సంతోషంగా కరమైన పరిణామం అన్నారు, గ్రామంలో ఒక పండగ వాతావరణం నెలకొందని .గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసినందుకు బాలవికాస సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జెసిబిలు గర్జిస్తున్నాయి...!

## గణపురం మండలంలో అక్రమ తవ్వకాల రాక్షసకాండ

**చెరువుల్ని కొల్లగొడుతున్న మట్టి మాఫియా..!**

**ఎమ్మెల్యే పేరు చెప్పుకుని మాఫియా మస్తాన్‌రాజ్యం**

**జేసీబీలతో చెరువుల ఛిద్రమ్.. ట్రాక్టర్లతో పరిశ్రమలకు మట్టి తరలింపు**

**పగలు రాత్రి తేడా లేకుండా దందా.. కళ్లుమూసుకున్న అధికారులు...?**

**- మైనర్ల చేతుల్లో ట్రాక్టర్ల స్టీరింగ్...? ప్రాణాలతో చెలగాటం**

**- లైసెన్స్ లేకున్నా రోడ్లపై మట్టి రాక్షసాలు..!**

**గణపురం, మే 22 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలో మట్టి మాఫియా చాపకింద నీరులా విస్తరిస్తోంది. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల అక్రమ దందా సాగిస్తున్న మాఫియా గుంపులు అధికార యంత్రాంగానికే సవాల్ విసురుతున్నాయి. అనుమతులు లేకుండానే భారీ జేసీబీలతో చెరువుల గుండెల్లో గోతులు తవ్వుతూ, ట్రాక్టర్ల ద్వారా మట్టిని పరిశ్రమలకు తరలిస్తూ యథేచ్ఛగా డబ్బులు దండుకుంటున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా సాగుతున్న ఈ దందాపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బుద్ధారం గ్రామంలోని బీసీ కాలనీ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇండస్ట్రీకి చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రోజుకు వందలాది ట్రాక్టర్ లోడ్లు తరలిస్తున్నా అధికారులు మాత్రం కనీసం తనిఖీలు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. చెరువు పరిరక్షణ బాధ్యత ఉన్న అధికారులు మట్టిదందా ఎదుట చేతులెత్తేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా గాంధీనగర్ గ్రామంలోని కుంటలో కూడా భారీగా అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొందరు వ్యక్తులు భూపాలపల్లి ఎమ్మెల్యే పేరు వాడుకుంటూ "మాకు పూర్తి అనుమతులున్నాయి.. ఎవరూ ఏమీ చేయలేరు" అంటూ గ్రామస్థులను బెదిరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల పేర్లను అడ్డం పెట్టుకుని అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమ దందాను నిర్భయంగా కొనసాగిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. గణపురం, చెల్పూర్, గాంధీనగర్, బస్వరాజుపల్లి, సీతారాంపూర్, కర్కపల్లి గ్రామాల్లో మట్టి మాఫియా మూడు పువ్వులు ఆరు కాయలుగా దందా కొనసాగిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడ చూసినా చెరువుల్లో భారీ గోతులు కనిపిస్తున్నాయని, చెరువుల అసలు స్వరూపమే మారిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తవ్వకాలతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో భూగర్భ జలాలు క్రమంగా అడుగంటిపోతున్నాయని చెబుతున్నారు. మట్టి మాఫియా దందాతో గ్రామాల్లో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. మట్టి ట్రాక్టర్ల రాకపోకలతో గ్రామ రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాలనీల్లో ఎప్పుడూ దుమ్ము, ధూళి కమ్ముకుని ప్రజలు శ్వాస తీసుకోవడానికే ఇబ్బందిపడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని మహిళలు వాపోతున్నారు. రాత్రివేళ ట్రాక్టర్ల గోలతో ప్రజలు నిద్రపోలేని పరిస్థితి నెలకొంది.

ఇక అక్రమ మట్టి రవాణాలో మైనర్లను వినియోగించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. చాలాచోట్ల మైనర్ బాలురే ట్రాక్టర్లను నడుపుతూ కనిపిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. సరైన డ్రైవింగ్ అనుభవం లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ట్రాక్టర్లు నడుపుతున్న పలువురి వద్ద సరైన వాహన పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్ కూడా లేవని ఆరోపిస్తున్నారు. కొంతమంది డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు కూడా లేకుండానే రోడ్లపై ట్రాక్టర్లు నడుపుతున్నారని చెబుతున్నారు. దీంతో గ్రామాల్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

### ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు...?

"ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి చూసే ప్రయత్నం కూడా చేయడం లేదు" అంటూ గ్రామస్థులు మండిపడుతున్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు మట్టి మాఫియాతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారుల అండదండలతోనే మట్టి మాఫియా ఇంత బహిరంగంగా రెచ్చిపోతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే.. మరోవైపు మట్టి మాఫియా వాటినే కొల్లగొడుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ నిపుణులు కూడా అక్రమ తవ్వకాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలు నాశనం కావడం వల్ల భవిష్యత్తులో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, అనుమతులు లేకుండా చెరువులను తవ్వుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న జేసీబీలు, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని బాధ్యులపై కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

# మొట్లపల్లిలో ఉత్సాహంగా బడిబాట







**మొగుళ్లపల్లి, మే 22 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ పాఠశాల లను బలోపేతం చేయడమే లక్ష్యంగా, విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'బడిబాట' (ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట) కార్యక్రమం మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలో శుక్రవారం ఉత్సాహంగా కొనసాగింది. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యుల బృందం గ్రామంలోని వీధివీధినా పర్యటిస్తూ విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఇంటింటా ప్రచారంలో భాగంగా మొట్లపల్లి పరిధిలోని కాసులపాడు, ఎస్సీ కాలనీల్లో ఉపాధ్యాయు లు ఇంటికింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి ఈడు ఉన్న ప్రతి చిన్నారీ బడిలో ఉండేలా అవగాహన కల్పించారు.

### అక్కడికక్కడే అడ్మిషన్లు...

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఎలా సాగుతుందో వివరిస్తూ, అక్కడికక్కడే 15 మంది విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు కల్పించారు.

### ప్రభుత్వ పథకాలపై అవగాహన..

ఉపాధ్యాయులు అవగాహన బ్యానర్లు చేతబూని, ప్రభుత్వ బడుల్లో ఉచితంగా అందిస్తున్న ఆంగ్ల మాధ్యమ బోధన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు తదితర సదుపాయాలను గ్రామస్తులకు వివరించారు.

### ఉపాధ్యాయుల విజ్ఞప్తి...

అత్యంత అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చెన్న సరిత, ఉపాధ్యాయులు మహేష్, శ్రీధర్, రమేష్, సురేందర్, సునీత, గ్రామస్తులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# కేటీపీపీ ఆలయంలో కంచి పీఠాధిపతి ప్రత్యేక పూజలు

**గణపురం, మే 22 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామంలోని కేటిపిపి పరిధిలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని కంచి కామకోటి 70వ పీఠాధిపతి జగద్గురు శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీఈ చిట్టా ప్రగడ శ్రీ ప్రకాష్ దంపతులు, ఆలయ అర్చకులు, ప్రాజెక్టు అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి కంచి పీఠాధిపతి చేతుల మీదుగా ప్రత్యేక పూజలు, అర్చనలు వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సింగరేణి జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, కేటీపీపీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విలేకర్ల ముసుగులో 'బ్లాక్‌మెయిల్' దందా....

**పచ్చబొట్టుగా మారిన పత్రికా విలువలు....**

**ఆధారాలు లేని తప్పుడు వార్తలతో అధికారులపై వేధింపులు....**

**వచ్చిన కాడికి దండుకుంటున్న విలేఖర్ల ముసుగు వీరులు.....**

**యాజమాన్యాల పర్యవేక్షణ లోపం.....**





**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) మే 22 (పీపుల్స్ డైరీ) :** ఇల్లందు నియోజకవర్గంలో కొందరు పత్రికా విలేఖర్ల ముసుగులో అక్రమ దందాలకు తెరలేపారు. సమాజంలో నాల్గవ స్తంభంగా నిలవాల్సిన పత్రికా రంగాన్ని కొందరు తమ స్వార్థ ప్రయోజనాలకు, అక్రమ సంపాదనకు ఆయుధంగా వాడుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి నిజాలు తెలుసుకోకుండా, కనీస ఆధారాలు లేకుండా తప్పుడు వార్తలు ప్రచురిస్తూ అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. బ్లాక్‌మెయిలే ధ్యేయం.. అందినకాడికి దండుడు! గత కొన్ని రోజులుగా ఇల్లందులో ఈ తరహా బ్లాక్‌మెయిల్ పర్వం పతాక స్థాయికి చేరింది. ఇటీవల ఓ ప్రభుత్వ అధికారిని లక్ష్యంగా చేసుకొని, పూర్తిగా అవాస్తవాలతో కూడిన కథనాన్ని వండి వార్చారు. ఆపై సదరు అధికారిని భయపెట్టి, బ్లాక్‌మెయిల్ చేసి అందినకాడికి దండుకున్నట్లు పట్టణంలో తీవ్ర చర్చ నడుస్తోంది. "మేము వార్త రాస్తే మమ్మల్ని అడిగేది ఎవరు? మా పేపర్.. మా ఇష్టం" అనే రీతిలో వీరు వ్యవహరిస్తుండటం వీరి అహంకారానికి, బరితెగింపునకు అద్దం పడుతోంది. యాజమాన్యాల దగ్గర ఆధారాలు శూన్యం..కథనంలో ఒక్క శాతం కూడా నిజం లేకపోయినా, పత్రికా యాజమాన్యాలు కూడా వీరిని ప్రశ్నించకపోవడం గమనార్హం. సదరు వార్తలకు సంబంధించి ఏవైనా ఆధారాలు ఉన్నాయా అంటే యాజమాన్యాల వద్ద 'లేవు' అనే సమాధానం వస్తోంది. బాధ్యతాయుతమైన పత్రికలు కూడా ఇలాంటి విలేఖర్ల చేతిలో కీలుబొమ్మలుగా మారడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే! ఒక వార్త రాసేటప్పుడు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను మాత్రమే ప్రజల ముందుకు తీసుకురావాలి. కానీ ఇల్లందులో జరుగుతున్న ఈ జర్నలిజంపై ప్రజలు, మేధావులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులను మానసిక క్షోభకు గురిచేస్తూ, వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న ఇలాంటి బ్లాక్‌మెయిలర్లపై ఉన్నతాధికారులు, పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఇల్లందు ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# మత్తుకు యువత చిత్తు

## మత్తుకు బానిస అవుతున్న యువత - అవగాహన సదస్సు లేవి..?

**చిట్యాల, మే 22 (పీపుల్స్ డైరీ) :** మత్తు పదార్థాలకు యువత బానిస కావడం ఒక సమస్యగా మారుతుంది. దీనివల్ల యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. డ్రగ్స్ మత్తు ఇంజక్షన్లు గంజాయి సిగరెట్ మద్యం తదితర మత్తుకు బానిసలై యువత తమ ఆరోగ్యంతో పాటు విలువైన జీవితాలను కోల్పోతున్నారు. అది పల్లె అయినా పట్నం ఐనా తేడా లేకుండా ఎక్కడైనా యువత మత్తుకు బానిస అవుతూ మత్తులోనే జీవితాన్ని గడుపుతూ జీవిత గమ్యం ఏంటో తెలియకుండానే మత్తులోనే జీవితం చితికి పోయేలా చేసుకుంటున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలో కొంత మంది యువత మద్యం మత్తులో సమయపాలన లేకుండా తూలుతున్నారు. నేటి యువత మేజర్లైన మైనర్ లైన సందర్భం ఏదైనా ఎక్కువగా పార్టీలంటూ పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి యువత సరదాగా గడపడానికి ఎక్కువగా మద్యం మత్తు సిగరేటు గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించడానికి ఇష్టపడుతున్నారు. మైనర్లకు సైతం మద్యం సులభంగా దొరుకుతుంది. దీంతో గ్రామాలలోని యువత పెడదారి పడుతున్నారు. యువత మద్యానికి మత్తు పదార్థాలకు బానిసయ్యే క్రమంలో ఏ రోజుకు ఆ రోజు సందర్భాన్ని బట్టి మంచికి అయినా చెడుకు అయినా యువత ఎక్కువగా మద్యానికి మక్కువ చూపి మద్యం మత్తులోనే చిత్తవుతున్నారు.



తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను అడియాశలు చేస్తున్నారు. కోటి ఆశలతో విద్యార్థులను చదివిపిస్తే వారి జీవితాలు మత్తులోనే ఉండడంతో తల్లిదండ్రులు పెట్టుకున్న కోటి ఆశలు అర్ధాంతరంగానే ముగుస్తున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలలో మద్యం మత్తు పదార్థాలు సులువుగా దొరకడం వలన యువత మద్యానికి మత్తుకు ఎక్కువగా బానిసవుతున్నారని గ్రామాలలోని ప్రముఖులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. యువత చెడు వ్యసనాలకి బానిసవ్వడానికి గ్రామాలలో మద్యం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించకపోవడం వలనే అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ మరియు ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు విద్యార్థులకు యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం లేదు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ వారు ఎవరితో స్నేహం చేస్తున్నారో పర్యవేక్షించడం చాలా ముఖ్యం. గంజాయి సరఫరా వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా 24 గంటలు మొబైల్ చేతిలో ఉండడం వలన దానిలో వచ్చే అశ్లీలతకే ఎక్కువగా ఆకర్షితులవ్వడం వలన యువత చెడు వైపుకే మొగ్గుతూ మత్తుకే ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు. మైనర్లు ఇప్పటినుండే మత్తుకు మద్యానికి బానిసలయితే భవిష్యత్తులో వారి జీవితం అంధకారమవుతుందని మత్తును మద్యాన్ని మైనర్లకు అందకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు తల్లిదండ్రులు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో మత్తు పదార్థాల వలన యువత ఏ విధంగా నష్టపోతున్నారు భవిష్యత్తులో వారు ఏ విధమైన నష్టాలను ఎదుర్కొంటారు వాటి వలన కలిగే అనర్థాలపై కష్టపడి చదివితే ఏ విధమైన ఫలాలు పొందవచ్చు అనే తదితర విషయాలపై సంబంధిత అధికారులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని తల్లిదండ్రులు గ్రామాల పెద్దలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com